అనుమతులు లేకుండా

అంతస్తుల నిర్మాణం ఎలా!?

- ఏసీపీతోపాటు ముగ్గురు ప్లానింగ్ అధికారులకు షోకాజు
- ఇద్దరు ఆర్ఐలు, మరో ఇద్దరు అడ్మిన్లకు కూడా.. 6లో..



పెన్నా హుషార్!

నెల్లూరు శివార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నా నది



అనంతసాగరం : నిండుకుండలా ఉన్న సోమశిల జలాశయం

- నదిలోకి 1.39 లక్షల క్యూసెక్కులకుపైగా వరద
- సోమశిలలోకి భారీగా చేరుతున్న నీరు
- బీరాపేరు, బొగ్గేరుల నుంచి సంగం బ్యారేజీలోకి..
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం
- లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు
- పెన్నానది పరిసరాల్లోకి వెళ్లరాదని ఆదేశాలు

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద..

బీరాపేరు, బొగ్గేరు వాగుల నుంచి భారీగా వస్తున్న నీటితో పెన్నమ్మ పోటెత్తుతోంది. జిల్లా ప్రధాన జలాశయమైన సోమశిల నుంచి 93 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, సంగం బ్యారేజీ నుంచి మరో 46వేల క్యూసెక్కులు మొత్తం 1.39 లక్షల క్యూసెక్కుల నీటితో పెన్నా నది పరవళ్లు తొక్కుతోంది. ఈ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంటుందని తెలియడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పెన్నా పరివాహక మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 76,015 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో జలాశయంలో 71 టీఎంసీల నీరు నిల్వ చేసి దిగువకు క్రస్ట్‌గేట్ల ద్వారా 77,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. - అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం, సంగం బ్యారేజీ నుంచి పెన్నాడికి భారీగా వరద పోటెత్తుతుండటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే సోమశిల నుంచి ప్రతి రోజూ 70 వేల క్యూసెక్కులకుపైగా నీరు పెన్నానదికి వదులుతున్నారు. దీనికి తోడు బీరాపేరు, బొగ్గేరు నుంచి కూడా వరద ప్రవాహం పెరగడంతో సంగం బ్యారేజీ నుంచి 1.4 లక్షల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు. దీంతో జిల్లా యంత్రాగం మొత్తం అప్రమత్తమైంది. పెన్నా పరివాహక మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. నదిలో నీటి ప్రవాహం స్థితిగతులపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం

నెల్లూరులోని లోతట్టు ప్రాంతాలైన జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్ నగర్, భగత్‌సింగ్ కాలనీ, గాంధీగిరిజన కాలనీ ప్రాంతాల ప్రజలను ఇప్పటికే అధికారులు అప్రమత్తం చేశారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వరదల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రధానంగా పెన్నానది పరిసరాల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

- పార్టీ శ్రేణులకు మంత్రి నారాయణ ఆదేశం

నెల్లూరు (సిటీ) : ఎగువ నుంచి సోమశిలకు వస్తున్న వరద ప్రవాహంతో పెన్నాకు అదే వరదను విడుదల చేస్తున్నందున నెల్లూరు నగర శివార్లలోని ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ టీడీపీ శ్రేణులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నాయకులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెన్నాకు సుమారు లక్ష క్యూసెక్కుల వరకు వరద వస్తున్నందున కరకట్లకు సమీపాన ఉన్న ప్రజల యోగక్షేమాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైతే వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగనివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేషన్ అధికారులు కూడా రంగంలోకి దిగి పెన్నా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

'సంగం' బ్యారేజీ వద్ద..

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి సోమశిల నీటితోపాటు బీరాపేరు, బొగ్గేరు నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం 1.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా, 12.6 అడుగులకు నీటిమట్టం చేరింది. ఇందులో సోమశిల నుంచి 93 వేల క్యూసెక్కుల ప్రవాహం, బీరాపేరు, బొగ్గేరు వాగుల ద్వారా సుమారు 46 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. అయితే సాయంత్రానికి 5 వేల క్యూసెక్కుల ప్రవాహం తగ్గింది. బ్యారేజీకి వస్తున్న వరదను వచ్చినట్టే 79 గేట్లతోపాటు కుడివైపు ఉన్న మూడు గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నట్లు సెక్షన్ ఏఈ వినయ్ తెలిపారు. సంగం బ్యారేజీకి భారీగా వరద ప్రవాహం రావడంతో పాత ఆనకట్టలో కనిగిరి ప్రధాన కాలువ హెడ్‌రెగ్యులేటర్‌లో ఒక గేటు దెబ్బతిన్నది. దీంతో సుమారు 300 క్యూసెక్కుల నీరు కనిగిరి రిజర్వాయర్‌కు వెళ్తోంది. దెబ్బతిన్న గేటును యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాల్సి ఉంది.

'కండలేరు'లో 58.83 టీఎంసీలు

రాపూరు : కండలేరు డ్యాంలో నీటిమట్టం 58.83 టీఎంసీలకు చేరుకున్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 890 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 850 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నట్లు తెలిపారు.

'రాళ్లపాడు'లో 20.2 అడుగులు

లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 20.2 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి కేవలం 150 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తున్నట్టు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే రైతుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టులో నీటిమట్టం 20 అడుగులకు తగ్గకుండా నిల్వ ఉంచుతామని తెలిపారు.

'గండిపాళెం'లో 22 అడుగులు

ఉదయగిరి : గండిపాళెం జలాశయ నీటిమట్టం 22 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి పేర్కొన్నారు. పైతట్టు ప్రాంతం నుంచి 780 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు తెలిపారు.



లింగసముద్రం : రాళ్లపాడు రిజర్వాయర్‌లో నీరు

ప్రత్యేక అభివృద్ధి

పక్కదారి!

- 11 వర్కుల్లో అవినీతి జరిగిందన్న ప్రభుత్వం
- ఇప్పటికే చార్జెస్ ఫ్రేమ్ చేసిన సర్కారు
- నగర పాలకసంస్థలో నలుగురు ఇంజనీర్లపై విచారణ

మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

నెల్లూరు(సిటీ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. ఇందులో ఈఈ అళహరి శేషగిరితోపాటు డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈలు ఖాదర్‌మస్తాన్, ఫాజిల్ ఉన్నారు. ఇప్పటికే జరిగిన ప్రాథమిక విచారణలో అవకతవకలను గుర్తించినట్లు తెలుస్తుండగా ఆ మేరకు విధి నిర్వహణలో చార్జెస్ ఫ్రేమ్ చేశారు. తదుపరి సమగ్ర విచారణకు ఆదేశించిన ప్రభుత్వం రానున్న మూడు నెలల్లో నివేదికను తమకు అందచేయాలని ఆదేశించింది. విచారణ అధికారిగా టిడ్కో చీఫ్ ఇంజనీర్ రామమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్డీఎఫ్) ద్వారా నెల్లూరులో అనేక పనులు చేయగా, 11 వర్కులను ఓ కాంట్రాక్టర్ టెండర్ల ద్వారా పొందగా ఆయన స్థానంలో మరొకరితో ఒక సీసీ రోడ్డును రూ.40 లక్షలతో, మరో 10 సీసీరోడ్లు ఒక్కొక్కటి రూ. 5 లక్షలతో నిర్మించారు. ఇవి పారదర్శకంగా లేకపోవడం, నాణ్యత ప్రమాణాలకు దూరంగా ఉండటంతో గత ప్రభుత్వంలోనే విజిలెన్స్ విచారణ జరిగినట్లు సమాచారం. అప్పట్లోనే వీరందరిపై చార్జెస్ ఫ్రేమ్ అయినట్లు తెలుస్తోంది. కాగ ఆ పనులకు సంబంధించిన పత్రాలన్నీ విచారణ అధికారికి అందచేయడంతోపాటు అధికారులపై తలెత్తిన ఆరోపణలు, చార్జెస్ ఫ్రేమ్‌తో నెలకొన్న వివాదంపై వివరణ ఇవ్వాలని తాజా ఉత్తర్వుల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించారు. ఇందులో ఓ అధికారిపై వరుస విచారణలు ఉండటం గమనార్హం.

తుఫాన్ పరిహారం

బ్యాంకు ఖాతాల్లోకి..

- అర్హులకు అందేలా కలెక్టర్ నిర్ణయం

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బాధితులకు అందించే పరిహారాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. బాధితులకు ఇచ్చే పరిహారం పక్కదారి పట్టకుండా, అర్హులైన వారికి నగదు చేరేలా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. బాధితులకు బ్యాంకు ఖాతా లేకపోతే వారి చేత ఖాతా తెరిపించి పరిహారం జమ చేయనున్నారు. సహాయ కేంద్రంలో ఉన్న కుటుంబం లోని ఒక్కొక్కరికి రూ.వెయ్యి వంతున, ముగ్గురికి రూ.3 వేలు, కుటుంబంలో ఎంతమంది ఉన్నా రూ.3వేలకు మించకుండా పరిహారం చెల్లిస్తారు. ఇక పంట నష్టాలకు సంబంధించి రైతులకు రాబోయే పరిహారం కూడా వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేయనున్నారు.

పంట నష్టాలు ఇలా..

వ్యవసాయ శాఖ పరిధిలో 1,365 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 1282.63 హెక్టార్లలో వరి పైరు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదేవిధంగా 41.10 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఆశాఖ అధికారులు గుర్తించారు.

దెబ్బతిన్న రోడ్లు

తుఫాన్ దెబ్బకు జిల్లాలో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు బాగా దెబ్బతిన్నా యి. ప్రాథమిక అంచనా నివేదికను అధికా రులు ప్రభుత్వానికి పంపారు. పంచాయతీ రాజ్ పరిధిలో 290 కి.మీ పొడవున రోడ్లు దెబ్బనిగా, తాత్కాలిక మరమ్మతులకు రూ.1.77 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.146.60 కోట్లు అవసరమని ఆ శాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. రోడ్లు భవనాల శాఖ పరిధిలో 462 కి.మీ మేర రహదారులు దెబ్బతినగా, తాత్కాలిక మరమ్మతులకు రూ.22.87 కోట్లు, శాశ్వత పనులకు రూ.164 కోట్లు అవసరమవుతుందని నిర్ధారించారు.



చిట్టిగుంట : మండల కేంద్రమైన దగదర్తిలో తుఫాన్ బాధితులకు సరుకులు పంపిణీచేస్తున్న తహసీల్దారు కృష్ణ తదితరులు

రెవెన్యూ వివరాలు ఇలా...

- 1,365 హెక్టార్లలో పంటల నష్టం
- కాలువలో పడి ఓ మహిళ మరణం
- మృతి చెందిన మూగ జీవాలు : 631
- ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలు : 117
- సహాయ కేంద్రాలకు తరలించిన వారు : 8,930 మంది
- పూర్తిస్థాయిలో, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు : 34
- వైద్య శిబిరాలు : 83

- నష్టాలపై ప్రాథమిక నివేదికలు సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన యంత్రాంగం

జలవనరుల శాఖ పరిధిలో...

తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు జలవనరులశాఖ పరిధిలో చెరువుల కరకట్టలు బలహీన పడ్డాయి. ఉధృతంగా ప్రవహించిన వరదలకు డ్రైయిన్లు కూడా దెబ్బతిన్నాయి. కాలువలు పూడికతో నిండి పోయాయి. తాత్కాలిక మరమ్మత్తులకు రూ.65కోట్లు, శాశ్వత మరమ్మతులకు సుమారు రూ.300 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు తయారు చేశారు.



బాధితులకు నిత్యావసరాల పంపిణీ

సహాయ కేంద్రాల్లో తలదాచుకున్న వారికి అధికారులు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. బుధ, గురువారాల్లో రెండు వేల కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కిలో వంతున బంగాళాదుంపలు, పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, చక్కెర అందచేస్తున్నారు. 13,512 మత్స్యకార, 106 చేనేత కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు.

నేడు జనజాతీయ

గౌరవ్ దివస్

- వివరాలు 8లో..

మాలకొండ హుండీల ఆదాయం రూ.1.06 కోట్లు



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

రాళ్లపాడు కాలువలకు

9న నీరు విడుదల

- ఆయకట్టు రైతులు జాగ్రత్తగా వాడుకోవాలి
- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు ఉన్నందున ఆయకట్టు పరిధిలో వరినారు మడుల కోసం నవంబరు 9వ తేదీన నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం కందుకూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రాజెక్టు అధికారులు, ఆయకట్టు ఛైర్మెన్ ఏలూరి వెంకటేశ్వర్లు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న 20 అడుగుల నీరు వరి సాగుకు సరిపోదని, మరో 40 శాతం నీరు అవసరం ఉందని, ఈ నీటిని సోమశిల ప్రాజెక్టు నుంచి రప్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రాజెక్టులో సిబ్బంది కొరతగా ఉన్నందున రైతులు సహకరించాలని, అలాగే నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్య, ఏఈ మనోహర్, టీడీపీ నాయకులు గురునాధం, సోంపల్లి మనోహర్, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



వింజమూరు ఎమ్పీడీవో కార్యాలయం ఎదుట పోలీసులు

వింజమూరు ఎంపీపీపై అవిశ్వాసం

- అనుకూలంగా 8 మంది ఓటు
- సభ్యులను ప్రలోభ పెట్టారంటూ ఆరోపణలు
- ఉద్రిక్తతల నేపథ్యంలో భారీ బందోబస్తు 8

బెల్టు తీస్తున్నారు!

సీఎం ఆదేశాలతో ఎక్సైజ్ వరుస దాడులు 8



యథావిధిగా

'ఎన్టీఆర్ వైద్య సేవ'లు

- రూ.200 కోట్లకుపైగా బకాయిలు
- చెల్లింపుపై ప్రభుత్వంతో ఆసుపత్రుల సంఘం చర్చలు సఫలం 8

మరో కేసులో లేడీడాన్‌కు రిమాండ్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నగదు వసూలు చేసిన కేసులో లేడీడాన్ నిడిగుంట అరుణకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి తమ వద్ద నగదు వసూలు చేసిందని బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో అరుణపై కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను విజయవాడ పోలీసులు శుక్రవారం పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయస్థానం అరుణకు 14 రోజుల రిమాండ్ విధించడంతో నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు.

నేడు పింఛన్ల పంపిణీ

3,04,749 మందికి రూ.133.12 కోట్లు

- వివరాలు 8లో..



వేదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు ప్రారంభం 8

రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు విద్యార్థిని ఎంపిక

రాపూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబరు 26న నిర్వహించే రాష్ట్రస్థాయి వక్తృత్వ, క్విజ్ పోటీలకు రాపూరు మండలం కండలేరు గురుకుల పాఠశాల పదవ తరగతి విద్యార్థిని పి. మేఘన ఎంపికయినట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ కె. భారతి శుక్రవారం తెలిపారు. నియోజక స్థాయిలో జరిగిన వక్తృత్వ, క్విజ్ పోటీలలో మొదటి స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11615
వెండి కిలో ధర	రూ. 153300
వెండి ఒక గ్రాము	రూ. 159.30

వరద సాయం.. అధికారుల ఇష్టారాజ్యం

బియ్యం ఇచ్చారు.. సాయం మరిచారు

చౌకిచర్ల గిరిజనుల ఆవేదన


వరద సాయం అందలేదంటున్న చౌకిచర్ల గిరిజనులు

విడవలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం అందజేస్తున్న వరద సాయంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇష్టం వచ్చినట్లు పేర్లు నమోదు చేసినట్లు పలువురు బాధితులు వాపోతున్నారు. నిజంగా నీట మునిగి ఇబ్బందులు పడిన బాధితులను విస్మరిస్తున్నారని రెవెన్యూ అధికారుల తీరుపై టీడీపీ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుపాను కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవటంతో చౌకిచర్ల, పార్లపల్లి, రామతీర్థం, గాదెలదిన్నె గ్రామంలో రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పునరాస కేంద్రాల్లో 283 కుటుంబాలను అధికారులు గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపారు. దీంతో ప్రభుత్వం వరద బాధితులకు ప్రభుత్వం 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను మంజూరు చేసింది. చౌకిచర్ల, గాదెలదిన్నె గ్రామాల్లో గిరిజన కాలనీలు నీటమునిగాయి. అనేక మంది గిరిజనులు నిరాశ్రయులయ్యారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి పశాంతిరెడ్డి వరద బాధిత ప్రాంతాలను పరిశీలించి గిరిజనులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. సాక్షాత్తు ఎమ్మెల్యే బాధితులకు ధైర్యం చెప్పినా, అధికారులు మాత్రం వీరికి ప్రభుత్వ సాయం అందజేయడంలో నేటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో చౌకిచర్ల గ్రామానికి చెందిన గిరిజ నులు రోడ్డుపైకి వచ్చి అధికారుల తీరును ఎండగడుతున్నారు. వర్షాలు కురిశాక కాల నీకి వచ్చిన రెవెన్యూ అధికారులు తమ ఇళ్లని పరిశీలించి కుటుంబానికి 5 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారని, అప్పట్లో తమ పేర్లు నమోదు చేసుకుని వెళ్లిపోయారని ఇప్పటిదాకా ప్రభుత్వ సాయం మాత్రం అందించ లేదన్నారు. పేర్లు రాసు కున్న ఆ అధికారులే ప్రస్తుతం తమకు వరద సాయం ఇవ్వటం కుదరదని ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులు, కోవూరు ఎమ్మెల్యే చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అసలైన బాధితులకు తప్పకుండా సాయం అందిస్తాం

అసలైన వరద బాధితులకు తప్పనిసరిగా ప్రభుత్వ సాయాన్ని అందజేస్తాం. తొలుత పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు వరద సాయాన్ని అందించాం. నీట మునిగిన కాలనీల జాబితాని అధికారులకు పంపాం. ఆదేశాలు వచ్చిన వెంటనే రెండవ విడతలో నీట మునిగి ఇబ్బందులు పడిన గిరిజనులకు వరద సాయాన్ని ఇస్తాం.

- అబ్దుల్ సలాం, ఆర్ఐ



సమర్థవంతంగా సహాయక చర్యలు

సీహెచ్ సుబ్బయ్య, తహసీల్దారు

మొంథా తుఫాను ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు ప్రజానీకం ఇబ్బంది పడకుండా సహాయక చర్యల్ని సమర్థవంతంగా చేపట్టామని తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య అన్నారు. తుఫాను ప్రకటన వెలువడి నప్పటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. కాలనీల్లో ఇబ్బందులు తలెత్తకుండా బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం అందించామన్నారు.

?. మండల పరిధిలోని గ్రామాల్లో భారీ నష్టం ఎక్కడైనా జరిగిందా

!. కోవూరు మండల పరిధిలోని గ్రామాల్లో పెద్దగా నష్టాలేమీ వాటిల్లలేదు. వేగూరులో ఓ పూరిల్లు నేలకూలింది. ఆ ఇంటి యజమానికి ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

?. పునరావాస కేంద్రాల మాటేమిటి

!. మండల పరిధిలో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాం. పునరావాస కేంద్రంలో 141 మంది సహాయం పొందారు. వారికి ఆహారం అందించాం. వారందరికీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆరు రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశాం.

?. నష్టపరిహారం ఎంత చెల్లించారు

!. పునరావాస కేంద్రంలో ఉన్న 141 మం దికి ఒక్కొరికీ రూ. 1000 చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందించనుంది. వారి అకౌంట్లలోకి నేరుగా నగదు జమ అవుతుంది.

?. పంటలు ఎక్కడైనా దెబ్బ తిన్నాయా

!. మండల పరిధిలో పంట నష్టాలేమీ సంభవించలేదు. వరి కోతలు పూర్తవడంతో పంట నష్టం తప్పింది.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

సీఆర్‌సీ అభివృద్ధికి చేయూతనందిస్తాం!

స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్


సీఆర్‌సీ అధికారులతో మాట్లాడుతున్న దీపావెంకట్

వెంకటాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌సీ (ప్రాంతీయ దివ్యాంగుల కేంద్రం) అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ సమీపంలో ఉన్న ప్రాంతీయ దివ్యాంగుల కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సీఆర్‌సీ భవన సముదాన్ని పరిశిలించారు. అనంతరం డీఈడీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ తన తండ్రి ముప్పవరపు వెంకయ్యానాయుడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో సీఆర్‌సీకి శంకుస్థాపన చేసి ఆయన చేతుల మీదుగానే ప్రారంభించారన్నారు. సీఆర్‌సీ ఈ ప్రాంతంలో ఉండడం జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రజలు సీఆర్‌సీ సేవలను వినియోగించుకోవాలన్నారు. సీఆర్‌సీలో హాస్టల్ సముదాయం, ఫంక్షన్ హాలు కూడా మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ జనార్ధన్ రాజు, స్వర్ణభారత్ ట్రస్ట్ అడ్మిన్ అధికారి జీ సుబ్బానాయుడు, బీజేపీ ఎస్సీ మోర్చా కార్యదర్శి ఆరుముళ్ల మురళీ, అక్షర విద్యాలయ డైరెక్టర్ కుముదా, ప్రిన్సిపాల్ ప్రియా, సీఆర్‌సీ అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోంది!


కార్డులు అందజేస్తున్న గ్రామ వ్యవసాయాధికారి కవిత

విడవలూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని గ్రామ వ్యవసాయ సహాయ అధికారిణి తువ్వర కవిత తెలిపారు. దంపూరు గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ కార్డులను శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కార్డులను ప్రవేశ పెట్టిందన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ అనిత, వ్యవసాధికారి లక్ష్మి ఆదేశాల మేరకు గ్రామంలోని రైతులకు కార్డులను అందజేస్తున్నామన్నారు. ఎకరాకు 3 బస్తాల చొప్పున రైతులకు యూరియా ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

న్యాయాధికారికి ఘన సన్మానం


న్యాయాధికారికి జ్ఞాపికను బహూకరిస్తున్న న్యాయాధికారిణులు

కోవూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ఐ కృష్ణయ్యను పదవీ విరమణ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆత్మీయ జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిణి చైతన్య మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో నిబద్ధతగా సుదీర్ఘ కాలం పనిచేయడం అభినందనీయమన్నారు. ఆయన పనితీరు అందరికీ ఆచరణీయమన్నారు. మేజిస్ట్రేట్ శివనమ్రత మాట్లాడుతూ న్యాయాధికారి కృష్ణయ్య అనుసరించిన విధానాలను తాము కూడా పాటిస్తామన్నారు. సన్మానసభలో ఏపీపీ స్టాలిన్, ఏజీపీ సలీమ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ సునీల్, సీనియర్ న్యాయవాదులు సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి, శ్యామాచార్యులు, జక్కా శేషమ్మ, మిరియాల శ్రీనివాసులురెడ్డి, సీహెచ్ తిరుమలేష్ మాట్లాడారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మనుబోలు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ ప్రభావిత 50కుటుంబాలకు శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు. లక్ష్మీనరసింహపురంలో 11 గిరిజన కుటుంబాలకు ఆయన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ సమయంలో మండ లంలో 4చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 128మందికి రెండురోజుల పాటు వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఒక్కో కుటుంబానికి 25కేజీల బియ్యం, కిలో చక్కెర, కిలో కందిపప్పు, కేజీ ఎర్రగడ్డలు, కేజీ ఉర్లగడ్డలు, కిలో నూనె ప్యాకెట్ ఇచ్చామన్నారు. ఆర్థిక సాయం ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకుఖాతాల్లో జమచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు కడియాల సునీల్‌నాయుడు, డీలర్ సంఘం అధ్యక్షుడు గోను దశయ్య, టీడీపీ నాయకులు కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలలోని శ్రీరంగరాజుపురం గ్రామంలో శుక్రవారం తుఫాను పునరావాస బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25కేజీలు బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ వుర్లగడ్డలు, కేజీ వుల్లిపాయలు, కేజీ పామాయిల్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మంజులమ్మ, సీఎస్ డీటీ, ఆర్, వీఆర్వోలు, స్థానిక నాయకులు ప్రసన్నకుమార్, జనార్దన్, మల్యాద్రి, బాబులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కొత్త ఆధార్ కార్డులు

బుచ్చిరెడిపాళెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే కొంతమంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేని సమస్యతో సంక్షేమ పథకాలకు దూరమౌతున్నారనే సమాచారంతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పెనుబల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం స్థానిక సర్పంచ్ పెంచలయ్య, సెక్రటరీ ఈశ్వరమ్మ తెలిపారు. పెను బల్లి ఆధార్‌కార్డులులేని మిక్స్‌డ్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 12 మంది, ఎంపీపీ మెయిన్ స్కూల్లో 25మందికి ఆధార్ కార్డులు నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు. అదే విధంగా జొన్నవాడలోని పాఠశాలలకు చెందిన మరో 30మంది గిరిజన విద్యార్థులతోపాటు పలువురు గిరిజనులకు కూడా ఈ ఆదార్ సెంటర్‌లో ఆధార్ అప్‌డేట్లుతోపాటు కొత్త ఆధార్ కార్డులు, చేర్పులు, మార్పులు చేయనున్నట్లు వారు తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరు

వెంకటాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో 20 మంది విద్యార్థులకుగాను 17 మంది హాజరయ్యారు.

పెంచలకోనలో కార్తీక మాసోత్సవాలు

రాపూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో నవంబరు 2వ తేదీ నుండి 5 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం తెలిపారు. నవంబరు 2న క్షీరాబ్ధికైశిక (చిలుక) ద్వాదశి సందర్భంగా శ్రీ వార్లకు అష్టోత్తర శత కళాభిషేకం, ధాత్రి సాలా గ్రామ పూజ, కార్తీక వన భోజనాలు, బంగారు గరుడాస్నానం, 4న సహస్ర కళాభిషేకం, అంకురార్పణ, 5న ఏకోత్తర సహస్ర (1001) కళాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 18న స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు.

మనగ్రోమోర్ సెంటర్ ప్రారంభం


మన గ్రోమోర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఏడీఏ శివనాయక్

మనుబోలు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో శుక్రవారం మనగ్రోమోర్ సెంటర్‌ను ఏడీఏ శివనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య, నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కిరణ్‌కుమార్, గ్రోమోర్ మార్కెటింగ్ మేనేజర్ మోహన్‌కృష్ణ, ఎన్ఎస్‌వో సుధాకర్, మేనేజర్ ఉయ్యాల వినయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పొదలకూరులో రక్తదాన శిబిరం

పొదలకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పొదలకూరు పట్టణంలోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో నోవా బ్లడ్ బ్యాంకు సహకారంతో పోలీసులు శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ ఎండీ.హనీఫ్‌లు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రసాద్, నజ్మా, సుల్తానా, రాధ, టీడీపీ నేతలు మస్తాన్‌బాబు, మల్లికార్జున్ నాయుడు, నాయకులు కోవూరు బక్కయ్య నాయుడు, బోగోలు భాస్కర్‌రెడ్డి, పెంచల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పూజిత

వెంకటాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు కూడలి వద్ద శుక్రవారం నూతన వైసీపీ కార్యాలయాన్ని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కాకాణి పూజితతో కలిసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కాకాణి పూజిత, జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండ రామిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, కనుపూరు, కసుమూరు సర్పంచ్‌లు నాటకం శీనయ్య, కడివేటి శివ, నేతలు భాస్కర్‌నాయుడు, మోహన్ నాయుడు, భాస్కర్ గౌడ్, మందల పెంచలయ్య, నరేష్ నాయుడు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ జయంతి

వెంకటాచలం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ జంగాలపల్లి గిరిజన కాలనీలో శుక్రవారం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 40 గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని నాయుడు, నేతలు పినిశెట్టి మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఐక్యతతో భారతదేశాన్ని నిర్మించిన సమైక్య సారధి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బుచ్చి మున్సిపాలిటీలోని రామచంద్రా పురం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం వేదవతి అన్నారు. శుక్రవారం పటేల్ జయంతిని పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులు గండికోట సుధీర్ కుమార్, బ్రహ్మారెడ్డి, అరుణకుమారి, బ్రహ్మా రెడ్డి, రసూల్, గంగాధర్, అహ్మదున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

కోవూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): లేగుంటపాడు గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా పౌరులకు సంక్రమించిన హక్కులు చాలా విలువైనవన్నారు. ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ పౌరుల హక్కుల్ని కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు గ్రామంలోని దళిత, గిరిజన కాలనీల్లో నెల చివరిరోజు కావడంతో రెవెన్యూ అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. డీటీ ప్రదీప్ మాట్లాడుతూ దళిత, గిరిజనుల హక్కుల కోసం ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువచ్చిందన్నారు. ఎంపీడీవో జలజాక్షి, ఏఈలు కసనా నాయక్, విజయ భాస్కర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూప ర్‌వైజర్ ఆదినారాయణమ్మ, ఆర్ఐ. అరుణ్, టీడీపీ నాయకులు వేమా కిరణ్, గోను సుబ్బ య్య తదితరులు పాల్గొన్నారు.

నింగీ.. నేలా.. ముద్దాడే వేళ..!



ఇదే.. పెన్న.. ఇదే పెన్న..
నిదానించి నడు..!
జనహృదయాల్లో ప్రవహించే
'జలకళ'నే చూడు!
ఇరుతీరాలు ఒరుసుకుంటూ
జొన్నవాడ కామాక్షమ్మ ఒడిలో
'కార్తీక' గీతం పాడుకుంటూ..
పరుగులిడే మా ప్రాణ గంగ..
నింగిని తాకే.. వే'గంగా'!
ఎంతమంచి 'పెన్న'తల్లి..
మా రైతన్నల కన్నతల్లి!

('మొంథా' తుఫాను శాంతించాక.. జొన్నవాడ వద్ద పెన్నానది నిండుగా ప్రవహిస్తున్న దృశ్యం)
- ఆంధ్రజ్యోతి, బుచ్చిరెడ్డిపాళెం.

అనుమతులు లేకుండా

అంతస్తుల నిర్మాణం ఎలా!?

- ఏసీపీతోపాటు ప్లానింగ్ అధికారులకు షోకాజు
- ఇద్దరు ఆర్ఐలు, మరో ఇద్దరు అడ్మిన్లకు కూడా..

నెల్లూరు(సిటీ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు ఎలా నిర్మిస్తున్నారు? ప్లాన్‌కు విరుద్ధంగా కమర్షియల్ వినియోగం ఎలా? పన్ను విధింపులో తప్పిదాలెందుకు వచ్చాయి? అంటూ సూటి ప్రశ్నలు వేసిన కమిషనర్ నందన్ పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం షోకాజు నోటీసులు ఇచ్చారు. కార్పొరేషన్ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు.. సుబేదార్‌పేట సచివాలయ పరిధిలో ప్రాపర్టీ అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం, ప్లాన్‌కు విరుద్ధంగా కమర్షియల్ వినియోగంపై ఏసీపీ రఘునందన్, టీపీబీవో వినయ్‌కుమార్, అడ్మిన్లు జయచంద్ర, ధనంజయ్‌లకు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు వివరణ ఇవ్వాలని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగ సుబేదార్‌పేటలోని కమర్షియల్ భవనానికి రెసిడెన్షియల్ అనుమతులు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలినట్లు ఉత్తర్వుల్లో చెప్పిన కమిషనర్ ఆ మేరకు జరిగిన తప్పిదంపై ఆర్ఐ లోకనాథం, శ్రావణ్‌కుమార్, అడ్మిన్లు రోహిణి, వెంకటేశ్వర్లుకు షోకాజు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

చేజర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడినందుకు మండలంలోని నాగులవెల్లటూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పోలిపోగు తిరపతయ్యను తాత్కాలికంగా విధుల నుండి తొలగిస్తూ జిల్లా డ్వామా పీడి గంగాభవాని ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధిహామీ పథకం కింద గతంలో జరిగిన పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ. 113678 అవినీతికి పాల్పడినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. కాగా, కేవలం రూ.26636 మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తం రూ.87046 చెల్లించకపోవడంతో ఏడు రోజుల్లో లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీచేశారు. అప్పటివరకు ఫీల్డ్ అసిస్టెంట్ పోలిపోగు తిరపతయ్యను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా అతని వద్ద ఉన్న రికార్డులు, సియుజి సిమ్‌లను స్వాధీనం చేసుకోవాలని చేజర్ల ఎంపిడీవోకి సూచించారు.

పెరమనలో ఇరువర్గాల ఘర్షణ

- ముగ్గురికి గాయాలు

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన గ్రామంలో బంగారు గొలుసు మాయంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వి మహాలక్ష్మమ్మ అనే మహిళ ఇంట్లో రెండు నెలల కిందట బంగారు గొలుసు మాయమైంది. ఈ క్రమంలో ఆమె వారి ఇంటికి సమీపంలో ఉన్న అంకిరెడ్డి కుమార్తెపైన గురువారం అనుమానం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం ఏర్పడింది. ఈ విషయంపై మహలక్ష్మమ్మ చేజర్ల మండలం పాతపాడులో ఉన్న కుమార్తె, అల్లుడుకు సమాచారం అందించింది. దీంతో వారు ఆత్మకూరులోని వారి సమీప బంధువులతో కలిసి కారులో పెరమన గ్రామానికి వచ్చి అంకిరెడ్డి ఇంటిపైకి వెళ్లారు. ఇరు వర్గాలు ఘర్షణకు దిగారు. కాగా, బయట వ్యక్తులు గ్రామానికి వచ్చి ఘర్షణ పడటాన్ని గమనించిన స్థానికులు వారిపై ఆగ్రహం వ్యక్తంచేసి కారు తాళాలు లాక్కుని వారిపై దాడి చేశారు. ఈ ఘర్షణలో శివ, అంజలి, తులసి అనే ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వారు ఆత్మకూరు వైద్యశాలలో చేరారు. మరో వర్గం వారు సంగం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసు పెట్టారు. పోలీసులు విచారిస్తున్నారు.

పొలంలో మట్టి అక్రమ తరలింపు

- రెండు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలోని మట్టిని అక్రమంగా తరలించడంతో హజరత్‌రెడ్డి అనే రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వర్షాలకు కూలిన ఇంటి పైకప్పు

- తప్పిన ప్రమాదం

కొండాపురం, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ఇంటి పైకప్పు కూలిన ఘటన శుక్రవారం మండలం లోని భీమవరప్పాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు విడవల పాటి వెంకయ్య తెలిపిన వివరాల మేరకు సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన పెంకుటింట్లో తన భార్య పేరమ్మతో కలసి నివసిస్తున్నా మన్నారు. భారీ వర్షాలకు నానడంతో పెంకులతో సహా పైకప్పు ఓవైపు కూలిందన్నారు. రాత్రి సమయంలో పైకప్పు కూలి ఉంటే ప్రమాదం జరిగేదని, ఇంట్లో ఎవ్వరూ లేక పోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితుడు అధికారులను కోరాడు.

వర్షం వస్తే పట్టలు కప్పాల్సిందే!

- శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం


శిథిలావస్థకు చేరుకున్న ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయం

ఆత్మకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం శిథాలావస్థకు చేరడంతో వర్షాకాలం వస్తే ప్లాస్టిక్ పట్టలు కప్పాల్సిందేనని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యాలయం బ్రిటీష్ కాలం నాటిది కావడంతో పెచ్చులూడి పడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి 2013లో తహసీల్దారు కార్యాలయానికి నూతన భవనం నిర్మించడానికి నిధులు మంజూరు చేయించారు. శిలాఫలకం వేసి పనులు మొదలుపెట్టారు. కానీ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిధుల కొరతతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం పైభాగాన్ని ప్లాస్టిక్ పట్టాలతో కప్పి కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే ఈ అవస్థలు తప్పడం లేదని, నూతన భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని అధికారులు, సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వాకర్స్ సంఘాల ఫౌండర్ ఆళ్వార్‌దాస్ 95వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులనాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆళ్వార్‌దాస్‌కు నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యం, కార్యదర్శి స్నేహ సురేష్, నేతలు రంగారావు, తిరుపతినాయుడు, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బీద నివాసానికి మంత్రి పార్థసారథి


మంత్రి పార్థసారిథికి స్వాగతం పలుకుతున్న బీద దంపతులు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు చేరుకున్న రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారిథి దంపతులు శుక్రవారం నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర నివాసానికి చేరకున్నారు. వారికి బీర రవిచంద్ర, జ్యోతి దంపతులతో పాటు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. తదనంతరం బీద నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో మంత్రి పాల్గొన్నారు. పలు అంశాలపై నేతలతో చర్చించారు. ఈ ఆత్మీయ కలయికలో ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ శివ ప్రసాద్, టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మలిశెట్టి వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సాధికారిక కన్వీనర్ పీఎల్ రావు, దేవరాల సుబ్రహ్మణ్యం, మేక నరేంద్ర, కుంకాల నాగేంద్ర, పెన్నా డెల్టా వైస్‌చైర్మన్ బీద గిరిధర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వీఆర్ హైస్కూల్ క్రీడామైదానంలో జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గాదం వాసు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డుతో సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే 11వ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

'రబీ' షురూ..!

- పల్లెల్లో మొదలైన వ్యవసాయ ప్రధాన సీజన్ ● నారుమళ్లకు పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు
- సమృద్ధిగా సాగు నీరు ● తొలి ప్రాధాన్యత వరి రకంపై మల్లాగుల్లాలు


దుక్కి దున్నుతున్న ట్రాక్టర్

నెల్లూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ ప్రధాన రబీ సీజన్ మొదలైంది. నెల్లూరు రూరల్లో ఈ మేరకు నారుమళ్లకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. రూరల్లోని అన్ని సాగునీటి వనరుల కింద సమృద్ధిగా నీరు ఉండటంతోపాటు వాతావరణం అనుకూలంగా ఉండటంతో సేద్యానికి సిద్ధమైన అన్నదాత తొలి ప్రాధాన్యత వరి రకం విత్తనం ఎంపిక చేసుకోవడం లో మల్లాగుల్లాలు పడుతున్నారు. నెల్లూరులో ప్రధాన వ్యవసాయ సీజన్ రబీ. ఈశాన్య రుతుపవనాల పలకరింపు తో మొదలైన సీజన్ రైతాంగాన్ని సేద్యం వైపు మళ్లించింది. విత్తనాలు చల్లేందుకు తమ పొలాలను సిద్ధం చేసుకుంటుండడం తో గ్రామాల్లో సందడి కనిపిస్తోంది. నెల్లూరుకు తూర్పున కృష్ణపట్నం కాలువతో పాటు, లేబూరు, సర్వే పల్లి, కోడూరు కాలువ కింద, పడమ ర వైపు కనుపూరు, నెల్లూరు కాలువలు, చెరువుల ఆయకట్టుతో పాటు, లోతట్టు రైతాంగం సుమారు 30 వేల ఎకరాలలో వరి సాగుకు సన్నద్ధమవుతోన్నారు. గడిచిన పది రోజులుగా వాతావరణం అనుకూలంగా మారడంతో విత్తనాలను సమీకరించుకునే పనిలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఇటీవల ఎడగారులో ఎప్పుడు లేని విధంగా రూరల్లోని అన్ని సాగునీటి వనరుల కింద పూర్తి విస్తీర్ణంలో వరిని సాగు చేసిన రైతులు అదే పరంపర రబీలోనూ కొనసాగించేం దుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఎల్లి దుక్కిలకు స్వస్తి పలికి ఏకంగా బురద దుక్కిలు దున్నేందుకు సమాయత్తమవుతున్నారు. దీంతో ట్రాక్టర్లు క్షణం తీరికలేకుండా దుక్కిల్లో నిమగ్నమయ్యాయి.

● తొలి ప్రాధాన్యత ఎంపికలో మల్లాగుల్లాలు

రబీ వ్యవసాయ సీజన్‌లో రైతులు తొలి ప్రాధాన్యత వంగడాన్ని ఎంపిక చేసుకోవడంలో మల్లాగుల్లాలు పడుతున్నారు. తొలత కేఎస్‌ఎం 1638 తొలి ప్రాధాన్యతలో ఉండగా తాజాగా ఆ స్థానంలో బీపీటీ 5204 రకం చేరి కేఎస్‌ఎం రెండో స్థానంలో నిలుస్తోంది. ఇక రెండో స్థానంలో ఉన్న ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం మూడవ స్థానంలోకి వచ్చింది. ఆ తరువాత స్థానాల్లో కేఎస్‌ఎం 733, 7715, ఎన్‌ఎల్‌ఆర్ 34449 రకాలు నిలుస్తున్నాయి. ఎడగారులో కీలక భూమిక పోషించిన ఎంటీయూ 1010 రకం రబీలో కనుచూపు మేర లేకపోవడం గమనర్హం. ప్రస్తుతానికి ఈ రకం వరి వంగడాలు ఆయా స్థానాల్లో ఉండగా రైతుల ఎంపికలో మార్పులుంటాయని వ్యవసాయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

● యూరియా పరిమితిపై ఆందోళన

ఇప్పటి వరకు వివిధ వ్యవసాయ సీజన్లలో కాగితాలకే పరిమితమైన యూరియా వాడకం కట్టడి రబీ నుంచి ఆచరణ సాధ్యానికి వ్యవసాయ శాఖ దిగడంతో సర్వత్రా ఉత్కంఠ మొదలైంది. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు ఎకరాకు యూరియా మూడు బస్తాలే. కానీ ఇప్పటి వరకు గరిష్ఠంగా రైతులు ఆరు బస్తాలను వాడేవారు. నెల్లూరులో ఎడగారు, ఇతర ప్రాంతాలలో ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత తీవ్రమవడంతో దిద్దుబాటు చర్యలకు పూనుకున్న రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు ఎకరాల మూడు బస్తాలు మాత్రమే వాడాలని నిర్ణయించింది. దీంతో రైతులందరికీ కార్డులు జారీ చేసిన ఆ మేరకు రాయితీపై మూడు బస్తాల యూరియా కట్టలను అందచేయనున్నారు. ఈ విధానాన్ని ప్రస్తుతం రైతులు జీర్ణించుకోలేని విషయమైనప్పటికీ తప్పని దుస్థితైంది.

రైతులకు మెరుగైన సేవలు



ప్రభుత్వ పరంగా రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం. యూరియా ఇప్పటికే క్షేత్ర స్థాయిలో అందుబాటులోకి చేర్చాం. ఎక్కడ ఇబ్బందులు రానివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. యూరియా తక్కువగా వాడటం వల్ల పంటకే ప్రయోజనం.

- నాగమోహన్, మండల వ్యవసాయాధికారి, నెల్లూరురూరల్

రేపు ఈశ్వరుడికి 20వ మహారుద్రాభిషేకం


మాట్లాడుతున్న ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో బాలాజీనగర్ త్యాగరాజ కల్యాణ మండపంలో ఈనెల 2వ తేదీన ఈశ్వరుడికి 20వ మహారుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ తెలి పారు. శుక్రవారం బాలాజీ నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా కార్తీక మాసంలో మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నామని తెలిపారు. కల్యాణ మండపంలో ఉదయం 8గంటలకు ఐదు అడుగుల శివలింగాన్ని తాత్కాలిక ప్రతిష్ఠించి వచ్చిన భక్తులచే గోత్రనామాలు చెప్పి సంప్రదాయంగా స్వయంగా అభిషేకం చేయిస్తామని తెలిపారు. అదేవిధంగా పుట్ట మట్టితో చేసిన 365 మృత్తికా లింగాలకు మహాలింగార్చన రుత్వికులచే జరుగుతుందని తెలిపారు. కుర్తాళ సిద్ధేశ్వరీ పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ నేతృత్వంలో 15 మంది రుత్వికులు పెద్ద శివలింగానికి 11రకాల ద్రవ్యాలతో మహాభిషేకం, పుష్పాభిషేకం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తీర్థ ప్రసాదాలతోపాటు సంకల్ప క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్ర లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందచేయనున్నట్లు తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి సౌజన్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని కోరారు. ఈ కార్యక్రమంలో తానే మస్తాన్, అంచూరు శ్రీనివాసులునాయుడు, ఆకుల హనుమంతరావు, ఆమంచర్ల ప్రభాకర్, నావులూరు శ్రీకృష్ణ, సుభాన్‌బాషా, ఎలమందారెడ్డి, జీవీ రెడ్డి, శేషయ్యనాయుడు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సబ్‌జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ.హరీష్, గంటా సతీష్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో 60 కేజీలు, బాలికల విభాగంలో 55 కేజీల లోపు బరువు కలిగిన క్రీడాకారులు, 2009 డిసెంబర్ 1వ తేదీ తర్వాత జన్మించి ఉన్నవా రు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు కర్నూలులో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే 35వ రాష్ట్ర కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నెల్లూరు(సిటీ), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు, ఖాళీ స్థలాల్లో చేరిన నీటిని వివిధ మార్గాల ద్వారా బయటకు పంపాలని కమిషనర్ నందన్ స్థానిక ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అక్కడక్కడ రోడ్లను ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను గుర్తించి తక్షణం తొలగించాలని సూచించారు.

క్రీడాకారిణుల ఉన్నతికి పీడీ సేవలు భేష్

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): క్రీడాకారిణుల ఉజ్వల భవితకు, వారి ఉన్నతికి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సీ.విజయకళ ఉత్తమ సేవలందించారని వీఎస్‌యూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. డీకే ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం జరిగిన పీడీ డాక్టర్ సీ.విజయకళ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడాకారిణులు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య సునీత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంజ ప్రతిష్ఠ


గణేష్ ఘాట్ స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5, 6, 7 తేదీలలో జరిగే దీపోత్సవానికి శుక్రవారం గుంజ ప్రతిష్ఠ చేస్తున్న స్వర్ణభారత్ ట్రస్టు ఎండీ దీపా వెంకట్, కమిటీ సభ్యులు

యువతకు ఆదర్శం సర్దార్ వల్లభాయ్ పటేల్



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పటేల్‌కు నివాళులర్పిస్తున్న కేడెట్స్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నేటి యువతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం పటేల్ జయంతిని పురష్కరించుకుని వీఆర్సీ కూడలి నుంచి పటేల్ విగ్రహం వరకు ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, వీఎస్‌యూ వైస్‌చాన్స్‌లర్ అల్లం శ్రీనివాసులు, రిజిస్ట్రార్ సునీత పాల్గొని పటేల్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఐక్యత కోసం ఆయన చూపిన మార్గాన్ని దేశంలోని నేటి యువత పాటించాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యతను ఆయన ప్రతీకన్నారు. దేశం యువత చేతుల్లో ఉందని, వారంతా ఐక్యంగా ఉంటే ప్రపంచం మన వైపు చూస్తుందని తెలిపారు. అనంతరం పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐవో వరప్రసాద్, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, బీజేపీ నేత సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ఎన్‌సీసీ కేడెట్స్ ఆధ్వర్యంలో...

నెల్లూరు(విద్య): 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నగరంలో కేడెట్స్ ర్యాలీ నిర్వహించి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఎదుట ఘనంగా రాష్ట్రీయ ఏకతా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ బాల్యం నుంచే దేశభక్తి భావాలతో స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశానికి

● ఘనంగా జయంతి వేడుకలు

తొలి ఉప ప్రధానిగా, హోంమంత్రిగా ఎన్నో విశిష్ట సేవలందించారన్నారు. దేశంలో కలిసేందుకు ఇష్టపడని 562 సంస్థానాలను ధైర్యసాహసాలు ప్రదర్శించి అత్యంత లౌక్యంతో సైనికచర్య ద్వారా దేశంలో విలీనం చేశారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా గుజరాత్‌లోని నర్మదానది తీరంలో అత్యంత ఎత్తైన పటేల్ విగ్రహాన్ని నిర్మించిన ప్రధాని మోదీ పటేల్ జయంతిని వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కేఎన్.నాగరాజు, థర్డ్ ఆఫీసర్ డీ.పెంచలయ్య, వెంగళరావునగర్ మున్సిపల్ స్కూల్, కేఎన్‌ఆర్ స్కూల్ క్యాడెట్స్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

● ఉక్కుమనిషిని స్ఫూర్తిగా తీసుకోవాలి

నెల్లూరు(క్రైం): భారతదేశ సమైక్యత, సమగ్రతను కాపాడిన ఉక్కుమనిషి సర్దార్‌వల్లభాయ్ పటేల్ సంకల్పాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రన్‌ఫర్ యూనిటీ కార్యక్ర మం నిర్వహించారు. పోలీసు కవాత్తు మైదానం నుంచి పటేల్ విగ్రహం వరకు రన్ సాగించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘణంగా నివాళులర్పించారు. అనంతరం దేశ అంతర్గత భద్రతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు చెంచురామారావు, చంద్రమోహన్, ఇన్‌స్పెక్టర్‌లు మిద్దె నాగేశ్వరమ్మ, అశోక్, రోశయ్య, వైవీ సోమయ్య, బాలకృష్ణారెడ్డి, జగన్మోహన్ రావు, రామకృష్ణ, వెంకటరెడ్డి, బీ.శ్రీనివాసరెడ్డి, ఆర్‌లు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● జనసేన నేతల నివాళి

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జనసేన పార్టీ నాయకులు నగంరంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పోలీసు పెరేడ్ మైదానంలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య శిబిరాన్ని ప్రారంభించారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, కార్యదర్శి శేషయ్య, డాక్టర్లు అఖిలేష్, పీ.మాధవ్‌రావు, రాజేంద్రరెడ్డి, పీ.సురేంద్రకుమార్, ఎం.వెంకటతరుణ్ పాల్గొన్నారు.

కేవీకేలో 3 నుంచి పుట్టగొడుగుల ఉత్పత్తిపై శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఆర్య పథకంలో భాగంగా గ్రామీణ యువతీ యువకుల 3వ తేదీ నుంచి రెండ్రోజులపాటు పుట్టగొడుగుల ఉత్పత్తిపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ.లలితాశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ డీ.విజయకుమార్‌నాయక్ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. పేర్లు నమోదుకు 9490004254ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాస అగ్రహారంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ.చిన్నారావు మాట్లాడుతూ మానవ హక్కుల అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు టీ.కిషోర్ కుమార్, ఉపాధ్యక్షుడు జేఎస్ గుప్తా, నాయకులు జీవీ రమణయ, పంకజ్, కుమార్, వినీత్ మాధవ్‌రెడ్డి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఉద్వాపన పూజ


రాహుకాల ఉద్వాపన పూజలో భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం సామూహిక రాహుకాల ఉద్వాపన పూజ కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారం, విశేష పూజలు జరిగాయి. చండీహోమం, కార్తీక మాసం సందర్భంగా సుందరేశ్వరస్వామి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపారాధనలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం వేద పారాయణం, కుంభహారతులు, పల్లకీసేవలు జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమాలను ధర్మకర్త మండలి సభ్యులు, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

'ఆర్‌అండ్‌బీ'లో ఏపీజేఏసీ నాయకుల ఆందోళన


ఆందోళన చేస్తున్న శరత్‌బాబు తదితరులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏపీజేఏసీ అమరావతి అసోసియేట్ అధ్యక్షుడు శరత్‌బాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు కార్యాలయంలో కింద కూర్చుని ఆదోళన చేశారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో లోకాయుక్త కేసులను ఎస్ఈ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దివ్యాంగ మహిళకు ట్రెసర్ పోస్టు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారన్నారు. వెంటనే ఆ మహిళకు పదోన్నతి కల్పించాలని కోరారు.

బ్రౌన్ జయంతి ప్రభుత్వ నిర్వహణ అభిలషణీయం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా ప్రకటించడం అభిలషణీయమని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుగు రామకృష్ణ, అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.కరుణశ్రీ, కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు, కోశాధికారి అన్నం శివకృష్ణ ఓ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీపీ బ్రౌన్ తన జీవితాన్ని, జీతాన్ని తెలుగు భాషా సేవకు అంకితం చేశారని, విదేశీయుడైనప్పటికీ తెలుగు భాషా సాహిత్యాల సేకరణలో, పరిష్కరణలో, ముద్రణలో తీసుకున్న చొరవ అనితరసాధ్యమని పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ పూనుకుంటే ప్రజాకవి వేమన మనకు లభించే వాడుకాడని, పురాణ సాహిత్యంతో పాటు అనేక ప్రబంధాలను ఆయన సేకరించి ముద్రణకు సిద్ధం చేయించారని, తన జీవితంలో నుంచి పరిష్కర్తలకు గౌరవ వేతనాలు చెల్లించిన మహనీయుడని కొనియాడారు.. నవంబరు 10న సీపీ బ్రౌన్ జయంతిని పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు వివిధ దశల్లో నిర్వహించాలని, పేర్కొన్నారు.

ఏ సమస్య ఉన్నా చెప్పండి : రూరల్ ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మీ ప్రాంతంలో ఎలాంటి సమస్య ఉన్నా నాకు తెలియజేసే సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 30వ డివిజన్‌లోని శ్రామికనగర్ ఎన్జీవో కాలనీలో నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నివాస ప్రాంతాలలో సమస్య లను పరిష్కరించేందుకు తన వంతు బాధ్యతగా చొరవ తీసుకుంటా నన్నారు. తనను ఎమ్మెల్యేగా కాకుండా కుటుంబ సభ్యుడిగా చూడాలని తెలిపారు. రూరల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నా యన్నారు.

● యూరియాపై ఆందోళన వద్దు : గిరిధర్‌రెడ్డి

అన్నదాతలు యూరియాపై ఆందోళన వద్దని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆమంచర్లలో యూరియా నిల్వలను అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన అనంతరం రైతులకు కార్డుల ద్వారా పంపిణీ చేసి మాట్లాడుతూ రూరల్లోని అన్నీ గ్రామాల్లో యూరియా సమృద్ధిగా ఉందన్నారు. ఎవరు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఊరూరా రైతులకు కావాల్సిన యూరియాను నిల్వ చేశామని, వాటిని ప్రతీ రైతుకు అందచేస్తామన్నారు.

డాక్టర్ మస్తాన్‌బాషా ఉన్నత పదవులు అధిరోహించాలి


డాక్టర్ మస్తాన్‌ను సన్మానిస్తున్న బాబర్‌జాన్, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ షేక్ మస్తాన్ బాషా ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కే.బాబర్‌జాన్ అన్నారు. శుక్రవారం డాక్టర్ మస్తాన్‌బాషాను ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా బాబర్‌జాన్ మాట్లాడుతూ మస్తాన్‌బాషా అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా, ఆర్థోపెడిక్ సర్జన్‌గా ప్రజలకు ఇతోధికంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజామస్తాన్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖాజారంతుల్లా, చిన్న మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



నేత్రపర్వం ఆదిదంపతుల ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసం దీపోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, పూజలు జరిగాయి. సాయంత్రం భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ప్రాకారోత్సవం కనుల పండువగా జరిగింది. ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

వేదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

నెల్లూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు మొదలయ్యాయి. తొలిరోజు పుణ్యాహవాచనం, కంకణ ధారణ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, కుంభ ఆవాహన, ఆరాధన, నివేదన, అధివాసాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి దంపతులు, ఈవో గోపి, ఉభయకర్తలు పాల్గొన్నారు. శనివారం గిరిప్రదక్షణ, పల్లకీసేవ జరగనున్నాయి.



మాలకొండ హుండీల ఆదాయం రూ.1.06 కోట్లు

వలేటివారిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి 37 హుండీల ద్వారా 12 శనివారాలకు రూ.1,06,20,700 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. మాలకొండ కల్యాణమండపంలో శుక్రవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ లెక్కింపులో నగదుతోపాటు 120.90 గ్రాముల బంగారం, 872.48 గ్రాములు వెండి, 8 యూఎస్ డాలర్లు, 125 పౌండ్స్, 286 రియాస్, 110 దిర్హామ్స్ రూపంలో లభించింది. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, భక్తులు, సేవాదళం సిబ్బంది, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.



యథావిధిగా 'ఎన్టీఆర్ వైద్య సేవ'లు

- జిల్లాలో రూ.200 కోట్లకుపైగా బకాయిలు
- చెల్లింపుపై ప్రభుత్వంతో ఆసుపత్రుల సంఘం చర్చలు సఫలం
- 20 రోజుల సమ్మె తర్వాత పునరుద్ధరణ



నెల్లూరులోని ఓ నెట్‌వర్క్ ఆసుపత్రిలో రోగులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అందించే వైద్య సేవలు ప్రైవేటు ఆసుపత్రుల్లో శుక్రవారం నుంచి యథావిధిగా కొనసాగాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో ఆయా ఆసుపత్రులు వైద్య సేవలను నిలిపివేసి సమ్మెకు దిగిన విషయం తెలిసినదే. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆషా) ప్రతినిధులు పలు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవటంతో నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మె కొనసాగింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 32 నెట్‌వర్క్ ఆసుపత్రులకుగాను 13 ఆసుపత్రులలో వైద్య సేవలు నిలిపి వేశారు. అక్టోబరు 10వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద పూర్తిస్థాయిలో వైద్య చికిత్సలు ఆపివేసి సమ్మెలోకి వెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రులతో కలిపి జిల్లాలోని 124 నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 200 కోట్లకుపైగా బకాయిలున్నాయి. ఒక్క నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికే రూ.88 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే తాజాగా ప్రభుత్వంతో చర్చలు ఫలించడం, బకాయిల్లో రూ. 250 కోట్లు నవంబరులో చెల్లిస్తామని, మరో రూ. 3వేల కోట్లు బ్యాంకు అప్పుద్వారా వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఆసుపత్రులు సమ్మె విరమించాయి. దీంతో శుక్రవారం నుంచి జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు కొనసాగాయి.

బెల్టు తీస్తున్నారు!

- సీఎం ఆదేశాలతో ఎక్సైజ్ వరుస దాడులు
- అదుపులో అక్రమ మద్యం విక్రయదారులు
- మావాళ్లే వదిలేయాలని నేతల ఫోన్లు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

నెల్లూరు(క్రైం) అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం బెల్ట్‌షాపులు కనిపించకూడదంటూ ఇటీవల సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు కావడంతో బెల్ట్ షాపులను కుటీర పరిశ్రమగా మార్చారు. వైసీపీ ప్రభుత్వంలో బెల్ట్ అన్నీ వర్గాలవారికి అలవాటుగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసింది. నూతన మద్యం పాలసీని అందుబాటులోకి తెచ్చింది. దీంతో ప్రైవేటు వైన్‌షాపులు ఏర్పడ్డాయి. అయితే గత ప్రభుత్వంతో పోటీ పడుతూ ఈ ప్రభుత్వంలోనూ బెల్ట్ షాపుల సంఖ్య పెరిగింది. దీంతో సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి బెల్ట్ షాపులను పూర్తిగా నియంత్రించాలని ఆదేశించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు జిల్లాలో బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించారు.

మనవాళ్లే వదిలేయండి...

ఈనెలలో వరుస దాడులు జరుపుతూ ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపారు. అయితే ప్రస్తుతం నడుస్తున్న బెల్ట్‌షాపుల్లో అధికంగా వైన్ షాపులవారే సబ్ లీజ్‌కు మద్యం విక్రయిస్తున్నారని సమాచారం. వీటిపై చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్ అధికారులు అడుగులు వేస్తుంటే... అధికార పార్టీ నాయకులు ఫోన్లు చేసి, అవి మనవారివే వదిలేయండి.. అని చెబుతున్నారు. దీంతో చేసేది లేక అధికారులు వెనుకడుగేస్తున్నారు. ఓ పక్క సీఎం చంద్రబాబే బెల్ట్‌పై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు ఇస్తుంటే, మరో పక్క అధికారపార్టీ నాయకులు వదిలేయమని చెబుతుండడంతో అధికారులు ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.



ఎక్సైజ్ అధికారులు గత ఏడాది అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు జరిపిన దాడుల వివరాలు

స్టేషన్	కేసులు	నిందితులు	ఐఎంఎల్ (లీటర్లు)	బీర్ (లీటర్లు)	సీజ్ చేసిన వాహనాలు
నెల్లూరు-1	76	76	166.14	-------	----
నెల్లూరు-2	82	90	198.72	-----	2
కావలి	120	121	273.27	-------	----
కోవూరు	93	93	176.76	---------	1
బుచ్చి	67	67	111.8	---------	----
ఉదయగిరి	118	118	258.3	---------	3
కలిగిరి	102	102	236.16	---------	----
ఇందుకూరుపేట	77	77	184.92	---------	----
ఆత్మకూరు	95	96	250.11	---------	1
పొదలకూరు	97	97	180.36	6.5	----
కందుకూరు	71	71	136.03	---------	----
మొత్తం	998	1008	2172.51	6.5	7

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతీ నెల అందించే సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వీ నాగరాజకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 3,04,749 మంది పింఛనర్లు ఉన్నారని తెలిపారు. వారికి రూ.133.12 కోట్లను పింఛనుగా అందచేస్తామని వివరించారు. 13,510 క్లస్టర్లలో 6445 మంది సిబ్బంది ఈ పింఛన్లను ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చేవూరు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారత దేశానికి దశాబ్దన్నర కాలం ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఇందిరాభవన్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ ఇందిరాగాంధీ గరీబీ హఠావో నినాదంతో నిరుపేదల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారన్నారు. దేశంలో మొదటి సారిగా 14 బ్యాంకులను విలీనం చేసిన ఘనత ఆమెదేనన్నారు. 1970లో రాజభరణాలను రద్దు చేశారన్నారు. 20 సూత్రాల పథకాన్ని ప్రవేశ పెట్టారని, 1974లో మొదటి సారిగా పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. 1972లో చారిత్రాత్మక సిమ్లా ఒప్పందాన్ని అప్పటి పాకిస్తాన్ ప్రధాని జుల్ఫీకర్ బుట్టోతో కుదుర్చుకున్నారన్నారు. 1971లో రష్యాతో 20 ఏళ్లపాటు శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని చెప్పారు. అత్యున్నత పురస్కారం భారతరత్న దక్కిన తొలి మహిళగా ఎంతో పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఇందరమ్మ పేరు భారత దేశ చరిత్ర ఉన్నంత వరకు గుర్తింటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏటూరి శ్రీనివాసులరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు మోహన్‌రెడ్డి, పప్పర్తి గణేష్‌బాబు, అల్లాఉద్దీన్, ఫజలుద్దీన్, నాగిరెడ్డి రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు

వింజమూరు ఎంపీపీపై అవిశ్వాసం

వింజమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎంపీపీ ఇనగలూరు మోహన్‌రెడ్డిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని కావలి ఆర్డీవో వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎమ్పీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశానికి 12 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా 11 మంది హాజరై 8 మంది సభ్యులు అవిశ్వాసానికి మొగ్గు చూపారు. ముందుగా సమావేశ హాల్‌లోకి వచ్చిన ఎంపీటీసీలతో ఎంపీపీ ఇనగనూరి మోహన్ రెడ్డి తాను ఎన్నికలకు పెట్టిన ఖర్చు మొత్తం ఇచ్చి ఎవరికైనా ఓటు వేసుకోవచ్చని సభ్యులకు సూచించారు. దీంతో కొంతసేపు గందరగోళం పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్డీవోతోపాటు పోలీసులు జోక్యం చే సుకుని అందరినీ బయటకు పంపేసి అవిశ్వాస తీర్మాన ప్రక్రియను కొనసాగించారు. అ విశ్వాసానికి అనుకూలంగా 8 ఓట్లు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. ఎంపీటీసీ పల్లాల కొం డారెడ్డి సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చి ఎంపీటీసీ సభ్యులను ప్రలోభ పెట్టి వారి ఆర్థిక అవసరాలను అలుసుగా తీసుకుని కొంతమంది ఇటువంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్పీ డీవో శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు పాల్గొనగా, 8 మండలాల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అవిశ్వాసానికి అనుకూలంగా ఉన్న ఎనిమిది మంది ఎమ్పీటీసీ సభ్యులు

నేడు జనజాతీయ గౌరవ్ దివస్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జనజాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమాన్ని నగరంలోని గిరిజన్ భవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ.మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ గౌరవ్ దివాస్ కార్యక్రమం శనివారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వశాఖ, ట్రైబల్ కల్చర్ అండ్ ట్రైనింగ్ మిషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టైప్-3 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పీజీటీ, సీఆర్‌టీ పోస్టులకు తాత్కాలిక గెస్ట్ ఫ్యాకల్టీలుగా పని చేసేందుకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లింగసముద్రంలో పీజీటీ ఫిజిక్స్, బోటనీ, కలిగిరిలో పీజీటీ ఎంపీహెచ్‌డబ్ల్యు, కలిగిరిలో సీఆర్‌టీ మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, సీతారామపురంలో తెలుగు, వలేటివారిపాలెంలో హిందీ, కందుకూరులో కెమిస్ట్రీ, సీఆర్‌టీ ఫిజిక్స్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే జనరల్ కేటగిరి అభ్యర్థి వయస్సు 48 ఏళ్ల లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు 47 ఏళ్ల లోపు, విభిన్న ప్రతిభావంతులు 52 ఏళ్ల లోపు, ఎక్స్ సర్వీస్ ఉమెన్ 45 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు సంబంధిత ఎంఈవో కార్యాలయాల నుంచి దరఖాస్తులు తీసుకుని అక్కడే పూర్తి చేసి, అర్హత ధ్రువీకరణ జెరాక్స్ కాపీలతో ఈనెల 4వ తేదీ లోపు అందచేయాలని పేర్కొన్నారు.

బిట్రగుంట రైల్వే కార్యాలయాల తనిఖీ

బిట్రగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని పలు కార్యాలయాలను రైల్వే జోనల్ అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వచ్చిన జోనల్ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరమణారెడ్డి, విజయవాడ ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు కలిసి ప్రత్యేక రైల్లో గూడూరు వెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం బిట్రగుంట రైల్వే స్టేషన్‌లోని క్రూ కంట్రోల్ కార్యాలయం చేరుకుని రికార్డులను పరిశీలించారు. నూతన స్టేషన్లో వసతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైలు ప్రమాద సమయంలో వినియోగించే ఏఆర్వీ, ఎంఆర్వీలను తనిఖీ చేశారు. డ్రైవర్లు, గార్డుల విశాంత్రి భవనాన్ని పరిశీలించారు. బోగోలు రైల్వే ఎల్సీ 144, రైలు క్రాసింగ్ పాయింట్స్‌ను సందర్శించారు. రాత్రి ప్రత్యేక రైల్లో విజయవాడకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

డీఎస్‌డీవో యతిరాజ్‌కు ఘనంగా వీడ్కోలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) ఆర్‌కే యతిరాజ్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. క్రీడా సంఘాలు, క్రీడా ప్రముఖులు, ప్రతినిధులు, ఉద్యోగులు కలిసి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాధికారులు, ప్రతినిధులు మాట్లాడారు. రెండు దశాబ్దాలకుపైగా కోచ్‌గా, జిల్లా అధికారిగా క్రీడారంగం ఉన్నతికి యతిరాజ్ కృషి చేశారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యకరంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం యతిరాజ్ దంపతులను ఘనంగా సత్కరించాయి. ఈ కార్యక్రమంలో చిత్తూరు డీఎస్‌డీవో ఏ బాలాజీ, పల్నాడు డీఎస్‌డీవో వీ నరసింహారెడ్డి, రిటైర్డ్ డీఎస్‌డీవో జీ వెంకటేశ్వరరావు, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్, ఏపీ జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామ్‌కిషోర్‌రెడ్డి, ఏపీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే మహబూబ్‌బాషా, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఆనం మహేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యతిరాజ్ దంపతులను సత్కరిస్తున్న క్రీడా రంగ ప్రతినిధులు

మొక్కజొన్న.. ఆదాయం మిన్న!

- 80రోజుల్లో చేతికొస్తున్న సైలేజ్ రకం
- ఎకరాకి రూ.20వేల వరకు ఆదాయం
- సాగుకు ముందే కొనుగోలు ఒప్పందం
- టన్నుకు రూ.2250 చెల్లించేలా 'ట్రూమీల్' ఒప్పందం

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులకు ఆదాయ వనరుగా మారింది సైలేజ్ మొక్కజొన్న. ఎకరా సాగుకు ఖర్చులుపోను రూ.20వేలకుపైగా మిగులుతోంది. దిగుబడులు బాగా వస్తే మరో రూ.4వేల వరకు అదనంగా వస్తోంది. తక్కువ నీటి వినియోగంతో సుమారు 80రోజుల్లోనే చేతికందే ఆరుతడి పంటగా దీనికి పేరుంది.

ప్రత్యేకతలివి...

తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం తీసుకొస్తుంది. 4 నుంచి 5 తడుల నీరు సరిపోతుంది. కూలీల అవసరం ఉండదు. ఒక ఎకరాకు సగటున 18 నుంచి 20 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. రూ.20వేల నుంచి రూ.24వేల వరకు నికర ఆదాయం లభిస్తుంది.

యాజమాన్య పద్ధతులు

సైలేజ్ మొక్కజొన్న సాగుకు ఖరీఫ్ సీజన్‌లో మే, జూన్, జులై నెలలు ఎంతో అనుకూలం. అదేవిధంగా రబీ సీజన్‌కు వస్తే అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి మొదటి వారం వరకు విత్తుకోవచ్చు. ఎకరాకి 12 కిలోల విత్తనాలు అవసరం. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదంటే కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి. దీనివల్ల తొలిదశలో మొక్కలకు ఆశించే తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చు. విత్తనాలు నాటే ముందు మూడు, నాలుగుసార్లు దుక్కి దున్నాలి. ఎకరాకి దాదాపుగా 10 టన్నులు బాగామాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. బోదె కాలువలు చేసుకోవాలి. బోదెకు 1/3 వవంతు ఎత్తులో విత్తనాలు నాటుకోవాలి. నత్రజని ఎరువును విత్తే సమయంలో మూడో వంతు, 25-30 రోజుల మధ్యలో మూడో వంతు, 50-55రోజుల మధ్య మిగిలిన ఎరువు వేయాలి. విత్తే సమయంలో సగం పొటాష్, మిగిలిన సగం ఎరువు పూత దశలో వేసుకోవాలి. జింకు లోపం కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.



కలుపు నివారణ

పంట విత్తిన తరువాత రెండు, మూడు రోజుల్లోపు అట్రాజిన్ కలుపు మందు 1200 గ్రాములు, 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు గమనిస్తే ఎకరాకి 2,4 డి సోడియం సాల్టు 500గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడల యాజమాన్యం

సైలేజ్ మొక్కజొన్నలో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 20యస్.సి 0.3మి.లీ లీటరు నీటితో కలిపి 12-15రోజులకు పిచికారీ చేయాలి. కత్తెర పురుగు నివారణకు పంట విత్తిన వారానికి ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని గమనించాలి. గుడ్లను, మొదటి దశ పిల్ల పురుగులను నివారించేందుకు వేప సంబంధిత మందు అజాడిరాక్స్ 1500పిపియం 5.మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకు ఎండు తెగులు, తుప్పు తెగులు నివారణకు మానూకోజెబ్ 2.5గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొడ తెగులుకు నివారణకు ప్రాపికొనజోల్ 1మి.లీ లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి.

గింజ నాటేప్పుడే కొనుగోలు ఒప్పందం

సైలేజ్ మొక్కజొన్న సాగుకు ట్రూమీల్ కంపెనీ రైతులతో ఒప్పందం కుదుర్చుకుని చెప్పిన ధరకే కొనుగోలు చేస్తుంది. గింజ నాటే సమయంలోనే ధరను ప్రకటించి రైతులతో ఒప్పంద పత్రం రాయించుకుంటారు. టన్నుకు రూ.2250లు చెల్లిస్తారు. ఆ సంస్థ వారే కోత మిషన్‌ను, వాహనాలను ఏర్పాటు చేసుకుంటారు. కోత అనంతరం వారం రోజులకు నగదు చెల్లింపులు చేస్తారు.

- శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ విశ్రాంత ఏడీ

ఇదే అనువైన సమయం

సైలేజ్ మొక్కజొన్న నాటేందుకు ఇదే అనువైన సమయం. సాగు చేసే ప్రతీ రైతుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం. టన్నుకు రూ.2250లు చెల్లించేలా ట్రూమీల్ సంస్థ వ్యవసాయశాఖతో ఒప్పందం చేసుకుంది. మెట్ట రైతులు పొలాలను ఖాళీగా వదిలేకంటే ఈ మొక్కజొన్నను సాగు చేయడం వల్ల ఆదాయం పొందవచ్చు. ఉదయగిరి, అనంతసాగరం, మర్రిపాడు, వింజమూరు, ఆత్మకూరు, పొదలకూరు, కలువాయి, చేజర్ల ప్రాంతాల్లో కొంత మంది రైతులు సాగు చేస్తున్నారు.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఉదయగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో మురుగు కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీడీవో బీ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంత వాసులు మురుగు కాలువ నిర్మించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సూచన మేరకు పరిశీలించి మురుగు కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపనున్నామని, నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11615
వెండి కిలో ధర	రూ. 153300
వెండి ఒక గ్రాము	రూ. 159.30

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి : ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరి: రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సంగం బస్టాండ్‌లో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసిన సీఐ, ఎస్ఐ

ఉదయగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. జాతీయ పోలీసు సంస్మరణ వారోత్సవాలు, జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సేవా బ్లడ్‌సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాయకులు, పోలీసులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరులైన పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటున్నారన్నారు. సమాజానికి పోలీసులు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. శిబిరంలో రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌నుంచి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబుల రెడ్డి, ఏడుకొండలు, శివకృష్ణ, ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శ్రీను, శివకృష్ణారెడ్డి, ఆదిలక్ష్మి, రఘునాద్, కలిగిరి సర్కిల్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● సంగం: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ సిస్టమ్ అత్యవసర పరిస్థితుల్లో ఎలా పనిచేస్తాయో విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించి వారి త్యాగాలు వృథా కానీయమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వంగల్లు కలుజు పరిశీలన



వంగల్లు కలుజుపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్ఐ.

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు కలుజును సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఇటీవల వర్షాలకు దువ్వూరు చెరువు నిండి వంగల్లు కలుజు పారుతోంది. దీంతో వంగల్లు ఎస్సీ, ఎస్టీ కాలనీలతోపాటు జంగాలకండ్రిక, మర్రిపాడు గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. శుక్రవారం కలుజుపై నీటి ప్రవాహం కాస్త తగ్గింది. స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్‌లు కలుజును సందర్శించి రాకపోకలు సాగించే ప్రజలకు జాగ్రత్తలు తెలియజేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నార్త్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ పొందడంతో ఉపాధ్యాయులు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు దంపతులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్ వలి

సీతారామపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు షేక్ మస్తాన్‌వలి, వి ప్రవీణల ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో అయ్యావారిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు షేక్ షఫీ అహమ్మద్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసేవకుడు పొన్నెబోయిన

● ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ ప్రజాసేవకుడని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం చెంచలబాబుయాదవ్ జన్మ దినం సందర్భంగా స్థానిక చెంచురామయ్య అతిధిగృహంలో టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ఆయనకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహా, ఏడుకొండలు, పెదవెంకటయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక కురవ వీధిలో యాదవ యూత్ ఆధ్వర్యంలో పొన్నెబోయిన చెంచల్‌బాబు యాదవ్ జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ యూత్ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పట్టదా...



రహదారి పక్కనే పడేసిన చెత్తాచెదారం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రధాన రహదారి వెంట దుకాణాలకు సంబంధించిన చెత్తాచెదారం, ఇతరత్రా ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడంతో అధ్వానంగా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : బీజేపీ



పాతాళపల్లిలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అనంతసాగరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముస్తాపురం, పాతాళపల్లి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారా నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యాన్ని దళారులు కాకుండా మిల్లర్లు కొనుగోలు చేసేలా పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినయ్, జిల్లా అధ్యక్షుడు నారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, బీజేపీ నాయకులు అల్లంపాటి రమణారెడ్డి, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై గ్రామస్థులకు అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు సోమ్లానాయక్

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో శుక్రవారం పౌర హక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సోమ్లానాయక్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో2 మల్లయ్య, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, వీఆర్వో శోభన్‌బాబు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐవో గోడ పత్రికల ఆవిష్కరణ



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎస్ఐవో బాధ్యులు

ఉదయగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో గల మదర్సాలో శుక్రవారం స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(ఎస్ఐవో) గోడ పత్రికలను ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌హఫీజ్, ఉదయగిరి పట్టణ అధ్యక్షుడు షేక్ అజరుల్లాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీనింగ్, మొరాలిటీ అండ్ ట్రాంక్విలిటీ అనే కార్యక్రమంలో భాగంగా నవంబరు 10వ తేదీ వరకు జాతీయస్థాయి క్యాంపెయిన్ చేపట్టామన్నారు. యువత, విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన జీవితం అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐవో బాధ్యులు ఇందాదుల్లా, తాహిల్, ముజిమిల్, ఫహిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు లోఓల్టేజీ సమస్య పరిష్కారం



ట్రాన్స్‌పార్మర్ వద్ద మాట్లాడుతున్న అధికారులు, నేతలు

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగంలో గత కొంతకాలంగా ఉన్న లోఓల్టేజి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. హైస్కూల్ సెంటర్‌లో గతంలో 100 కిలోవాట్ల రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవి. తాగునీటి మోటార్లతోపాటు ఇంటి కనెక్షన్లు ఎక్కువగా ఉండడంతో లోఓల్టేజి సమస్య తీవ్రంగా ఉండేది. దీంతో డిస్కమ్ అధికారులు ఉన్నతాధికారుల ప్రత్యేక అనుమతితో వాటి స్థానంలో 160 కిలోవాట్ల రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటుచేసి శుక్రవారం డీఈ సతీష్, టీడీపీ నాయకుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ మన్మథరావు, టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, కర్నాటి రవీంద్రరెడ్డి, డిస్కమ్ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండు లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నందున నవంబరు 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ కె వాణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో ఉర్దూ, ఆంగ్లం బోధించేందుకు జూనియర్ లెక్చరర్స్‌ను నియమించాల్సి ఉందన్నారు. అందుకుగాను ఉర్దూ బోధించుటకు ఎంఏ (ఉర్దూ), ఆంగ్లం సబ్జక్ట్ బోధించుటకు ఎంఏ (ఇంగ్లీషు) పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల18వ తేదీ ఉదయం 10-30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. అండర్ 14-17 విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడంతో పాటు జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీలను టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో జరుగు ఎంపికలకు పంపడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, టీడీపీ రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, సీనియర్ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, మద్దినేని నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, కూటమి నాయకులు.

కలువాయి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పంట సాగుచేసిన ప్రతి రైతుకు ఎకరాకు 3 బస్తాల యూరియా మూడు దఫాలుగా అందించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధంచేసిందని, కాబట్టి రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గాడిపర్తి జగదల్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం పీఏసీఎస్ ద్వారా యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైరు సాగుచేసిన రైతులంతా రైతుసేవా కేంద్రాలకు వెళ్లి యూరియా కార్డులు పొందాలన్నారు. పీఏసీఎస్, రైతుసేవా కేంద్రాలు, డీలర్ వద్దకు వెళ్లి కార్డుపై యూరియా తీసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చల్లా కళారాణి, కూటమి నాయకులు చల్లా రఘురామిరెడ్డి, జీ వెంకటేశ్వర్లు నాయుడు, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, దండు పెంచలయ్య, పెరంకొండ మనోహర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మించాలి

● సీపీఎం ఆందోళన



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని శుక్రవారం మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్‌రోడ్డు మొత్తం కోతకు గురై మోకాటిలోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దున్నపోతుల వాగుపైరు కల్వర్టు వరదలకు కొట్టుకుపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. బిజ్జంపల్లి ఎస్సీ కాలనీ వాగుపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. కొండ కింద గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు సరైన రహదారి మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు వంతెనలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాయబ్, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ పోరాటం



ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు తెలిపారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ ఆఫీసు సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు హానిచేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, జిల్లా సమితి సభ్యులు ఇండ్ల అంకమ్మ, ఏఐటీయూసీ నాయకులు బెల్లంకొండ హజరత్తయ్య, నాగేంద్ర, రమణయ్య, కొండయ్య, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

ఉదయగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆధ్వర్యంలో ఉక్కు మనిషి, సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేసీ విక్రమ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా

అంతస్తుల నిర్మాణం ఎలా!?

● ఏసీపీతోపాటు ప్లానింగ్ అధికారులకు షోకాజు

● ఇద్దరు ఆర్‌ఐలు, మరో ఇద్దరు అడ్మిన్లకు కూడా..

నెల్లూరు(సిటీ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు ఎలా నిర్మిస్తున్నారు? ప్లాన్‌కు విరుద్ధంగా కమర్షియల్ వినియోగం ఎలా? పన్ను విధింపులో తప్పిదాలెందుకు వచ్చాయి? అంటూ సూటి ప్రశ్నలు వేసిన కమిషనర్ నందన్ పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం షోకాజు నోటీసులు ఇచ్చారు. కార్పొరేషన్ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు.. సుబేదార్‌పేట సచివాలయ పరిధిలో ప్రాపర్టీ అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం, ప్లాన్‌కు విరుద్ధంగా కమర్షియల్ వినియోగంపై ఏసీపీ రఘునందన్, టీపీబీవో వినయ్‌కుమార్, అడ్మిన్లు జయచంద్ర, ధనంజయ్‌లకు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు వివరణ ఇవ్వాలని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగ సుబేదార్‌పేటలోని కమర్షియల్ భవనానికి రెసిడెన్షియల్ అనుమతులు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలినట్లు ఉత్తర్వుల్లో చెప్పిన కమిషనర్ ఆ మేరకు జరిగిన తప్పిదంపై ఆర్‌ఐ లోకనాధం, శ్రావణ్‌కుమార్, అడ్మిన్లు రోహిణి, వెంకటేశ్వర్లుకు షోకాజు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

చేజర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడినందుకు మండలంలోని నాగులవెల్లటూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పోలిపోగు తిరపతయ్యను తాత్కాలికంగా విధుల నుండి తొలగిస్తూ జిల్లా డ్వామా పీడి గంగాభవాని ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధిహామీ పథకం కింద గతంలో జరిగిన పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ. 113678 అవినీతికి పాల్పడినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. కాగా, కేవలం రూ.26636 మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తం రూ.87046 చెల్లించకపోవడంతో ఏడు రోజుల్లో లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీచేశారు. అప్పటివరకు ఫీల్డ్ అసిస్టెంట్ పోలిపోగు తిరపతయ్యను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా అతని వద్ద ఉన్న రికార్డులు, సియుజి సిమ్‌లను స్వాధీనం చేసుకోవాలని చేజర్ల ఎంపిడీవోకి సూచించారు.

పెరమనలో ఇరువర్గాల ఘర్షణ

● ముగ్గురికి గాయాలు

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన గ్రామంలో బంగారు గొలుసు మాయంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వి మహాలక్ష్మమ్మ అనే మహిళ ఇంట్లో రెండు నెలల కిందట బంగారు గొలుసు మాయమైంది. ఈ క్రమంలో ఆమె వారి ఇంటికి సమీపంలో ఉన్న అంకిరెడ్డి కుమార్తెపైన గురువారం అనుమానం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం ఏర్పడింది. ఈ విషయంపై మహాలక్ష్మమ్మ చేజర్ల మండలం పాతపాడులో ఉన్న కుమార్తె, అల్లుడుకు సమాచారం అందించింది. దీంతో వారు ఆత్మకూరులోని వారి సమీప బంధువులతో కలిసి కారులో పెరమన గ్రామానికి వచ్చి అంకిరెడ్డి ఇంటిపైకి వెళ్లారు. ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. కాగా, బయట వ్యక్తులు గ్రామానికి వచ్చి ఘర్షణ పడటాన్ని గమనించిన స్థానికులు వారిపై ఆగ్రహం వ్యక్తంచేసి కారు తాళాలు లాక్కుని వారిపై దాడి చేశారు. ఈ ఘర్షణలో శివ, అంజలి, తులసి అనే ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వారు ఆత్మకూరు వైద్యశాలలో చేరారు. మరో వర్గం వారు సంగం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసు పెట్టారు. పోలీసులు విచారిస్తున్నారు.

పొలంలో మట్టి అక్రమ తరలింపు

● రెండు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

సంగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలోని మట్టిని అక్రమంగా తరలించడంతో హాజరత్‌రెడ్డి అనే రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వర్షాలకు కూలిన ఇంటి పైకప్పు

● తప్పిన ప్రమాదం

కొండాపురం, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ఇంటి పైకప్పు కూలిన ఘటన శుక్రవారం మండలం లోని భీమవరప్పాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు విడవల పాటి వెంకయ్య తెలిపిన వివరాల మేరకు సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన పెంకుటింట్లో తన భార్య పేరమ్మతో కలసి నివసిస్తున్నా మన్నారు. భారీ వర్షాలకు నానడంతో పెంకులతో సహా పైకప్పు ఓవైపు కూలిందన్నారు. రాత్రి సమయంలో పైకప్పు కూలి ఉంటే ప్రమాదం జరిగేదని, ఇంట్లో ఎవ్వరూ లేక పోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితుడు అధికారులను కోరాడు.

వర్షం వస్తే పట్టలు కప్పాల్సిందే!

● శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయం

ఆత్మకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలం వస్తే ప్లాస్టిక్ పట్టలు కప్పాల్సిందేనని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యాలయం బ్రిటీష్ కాలం నాటిది కావడంతో పెచ్చులూడి పడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి 2013లో తహసీల్దారు కార్యాలయానికి నూతన భవనం నిర్మించడానికి నిధులు మంజూరు చేయించారు. శిలాఫలకం వేసి పనులు మొదలుపెట్టారు. కానీ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిధుల కొరతతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం పైభాగాన్ని ప్లాస్టిక్ పట్టాలతో కప్పి కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే ఈ అవస్థలు తప్పడం లేదని, నూతన భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని అధికారులు, సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
శనివారం,
1 నవంబరు 2025
7
కావలి
కందుకూరు
www.andhrajyothy.com

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575



వాలీబాల్ పోటీల్లో పెద్దపట్టపుపాలెం విద్యార్థిని ప్రతిభ

ఉలవపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పెద్దపట్టపుపాలెం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న తూపిలి ప్రవల్లిక ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే సలీంబాష, పీడీ బాలయ్యలు తెలిపారు. గత నెల 30వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూల్ క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచింది. దీంతో ఉపాధ్యాయులు కే హరిప్రసాదు, ఎస్ భాస్కరరావు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

తుఫాన్ బాధితులకు చేయూత

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలో ఇటీవల తుఫాన్ ధాటికి పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితులకు తహసీల్దారు కృష్ణ శుక్రవారం ప్రభుత్వం తరఫున నిత్యావసర సరుకులు అందజేశారు. చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, లీటరు పామాయిల్, కేజీ చక్కెర, కిలో బంగాళదుంపలు, కిలో ఉల్లిపాయలు పంపిణీ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర వర్గాలకు 25 కేజీల బియ్యం, ఐదురకాల సరుకులు అందించామన్నారు. అనంతారంలో 30 ఎస్టీ కుటుంబాలు, ధర్మవరంలో 27 ఎస్టీ కుటుంబాలు, చెన్నూరులో 46 చేనేత కార్మికుల కుటుంబాలు, పెద్దపుత్తేడులో 20 ఎస్టీలు, 17 చేనేత కార్మిక కుటుంబాలు, దగదర్తిలో బీసీ, ఎస్టీ 15 కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రియాంక, సీనియర్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

టీఆర్ఆర్‌లో మియావాకి వనం ఏర్పాటుకు సన్నాహాలు

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మియావాకి వనం ఏర్పాటు కార్యక్రమం చురుకుగా జరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ అనుమతితో స్కంధపురి సేవాసమితి కళాశాల ఆవరణలో 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఒక అడవి తరహాలో దట్టంగా మొక్కలు నాటి పెంచటం జరుగుతుందన్నారు. 50 రకాల మొక్కలను ఒక్కో రకానికి పది మొక్కలు చొప్పున ఒకటిన్నర ఎకరంలో 500 మొక్కలు నాటి వాటిని సంరక్షించి పెంచటం ద్వారా దట్టమైన అడవిని రూపొందించటం ఈ మియావాకి ప్రక్రియ ఉద్దేశమని ఆయన వివరించారు. శుక్రవారం స్కంధపురి సేవాసమితి కన్వీనర్ పువ్వాడి మౌనిక సమక్షంలో సర్వేచేసి ఆ భూమికి మార్కింగ్ ఇవ్వటం జరిగిందని, ఈ నెలాఖరుకల్లా పూర్తిచేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎన్ తిరుపతిస్వామి, బాలునాయక్, పి రాజగోపాల్, జి బ్రహ్మయ్య, ఎస్వీ శ్రీహరి, రత్నకరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 7 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలి

లింగసముద్రం, అక్టోబరు 31 (అక్టోబరు): మండలంలోని లబ్ధిదారులకు శనివారం ఉదయం 7 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని ఎంపీడీ కె శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో 5227 మంది పింఛను లబ్ధిదారులున్నారని, సాయంత్రం లోపు సుమారు 90 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లను అందజేయాలన్నారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

కొండాపురం, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం ఎస్సీకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి గ్రామ సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు శుక్రవారం రూ.15 వేలు అందజేశారు. గ్రామంలో ఎవరికి సమస్య ఉన్నా తన వంతు సాయం అందజేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంచాల ఏడుకొండలు, టీడీపీ నాయకుడు ఐతా వెంకటేశ్వర్లు, కాలనీవాసులు ఒంగోలు శేషగిరి, కే మోషు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతుల ఐక్యతే భారత్ బలం

కావలి (టౌన్) అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విభిన్న సంస్కృతుల ఐక్యతే భారతదేశం బలమని ఏకేవీకే డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చెంచురామయ్య పేర్కొన్నారు. పట్టణంలోని విట్స్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిజ్ఞ చేసిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డి, డాక్టర్ లిఖిత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోగోలులో వైద్య శిబిరం

బిట్రగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బోగోలు బాల కళ్యాణి కళ్యాణ మండపంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సాహిత్య అనూష, అంబేద్కర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

వలేటివారిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లెలో శుక్రవారం మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం అధ్యక్షతన మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఇందులో కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూధన్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడం వలన జరిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కట్టా హనుమంతరావు, పొట్టేళ్ల క్రిష్ణయ్య, చింతలపూడి రవీంద్ర, చౌడబోయిన యానాది, ఇరపని అంజయ్య, డేగా వెంకటేశ్వర్లు కామేశ్వరి పాల్గొన్నారు.

మాలధారులకు అన్న సంతర్పణ

కలిగిరి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలో భవానీ, శివయ్య, బాలాజి, అయ్యప్ప మాలలు ధరించిన స్వాములకు 21 రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శివస్వామి భక్తుడు దాసరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పూజా కార్యక్రమాలు భజనలతోపాటు స్వాములకు అన్నసంతర్పణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



బంగారు కుటుంబాలకు తోపుడు బండ్లు వితరణ

కావలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంలో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు కావలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సౌజన్యంతో కావలి పట్టణం, బోగోలు మండలానికి చెందిన 8 కుటుంబాలకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా తోపుడు బండ్లు అందజేశారు. కావలి టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు లేని రాష్ట్రమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. తోపుడు బండ్లు అందజేసి, వారి జీవనోపాధికి అవకాశం కల్పించిన ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు, ఎస్ఐలు ప్రసన్న కుమార్, బాషావలి, వారి బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దత్తత తీసుకున్న పీ-4 కుటుంబాలకు ఎలాంటి అవసరాలున్నా తాము అండగా ఉంటామని ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పీ-4 లీడర్ సత్యానంద్, బృంద సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

● వాహనదారుల అవస్థలు

లింగసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలేటివారిపాలెం నుండి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు, వీఆర్ కోట నుండి తాతా హోటల్ వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు, మొగిలిచెర్ల ఎస్సీ కాలనీ నుండి దత్తాత్రేయసామి గుడికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు, అలాగే చెరువు సమీపంలో నుండి వీఆర్ కోట వరకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లింగసముద్రం కోత మిల్లు ఎదురుగా దెబ్బతిన్న రహదారి



ఆ రోడ్డులో.. నిత్యం 'ట్రాఫి'కర్!

కావలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కో ఆపరేటివ్ కాలనీ ప్రధాన రోడ్డులో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతూ ఉంటుంది. ఈ రహదారికి అనుబంధంగా ఉన్న క్రిస్టియన్‌పేట రోడ్డులో అనేక ఆసుపత్రులు ఉన్నాయి. కో ఆపరేటివ్ కాలనీలో డిగ్రీ కళాశాలలు, వ్యాపార దుకాణాలున్నాయి. దీంతో ఈ రహదారి నిత్యం ప్రజలు, విద్యార్థులతో పాటు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రోడ్డు ప్రారంభంలో వరుసగా టాక్సీలను పెడుతున్నారు. దుకాణదారులు తమ ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు తదితర వాహనాలను కూడా రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితి. ప్రతీరోజూ ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో ప్రజలు, వాహనవారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రొయ్యలమేత లారీలు లోడింగ్, అన్‌లోడింగ్‌కు వచ్చినపుడు ఆ రోడ్డు వద్ద మలుపు తిరగాలంటే ఎంతో సమయం తీసుకుంటోంది. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే అంబులెన్స్‌లు సైతం ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి రోగులు ఇబ్బందిపడుతున్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ మార్గంవైపు ట్రాఫిక్ పోలీసులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. కావలిలో ట్రాఫిక్‌ను పోలీసులు పూర్తిగా గాలికి వదిలేశారని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి తోడ్పడాలని కందుకూరు శాసన సభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు శాఖల అధికారుల పనితీరు, పనులపై సమీక్ష జరిపారు. గ్రామీణ నీటి సరఫరా అధికారుల పనితీరుని తప్పుపట్టారు. ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు పంచాయతీల్లోని నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, ఈవోపీఆర్డీ, ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ఉపాధి అధికారులు గోకుల షెడ్లు, ఉద్యానవన మొక్కల పెంపకం బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, పనితీరు మార్చుకోవాలన్నారు. పక్కాగృహాల మంజూరు విషయంలో తుఫాన్ బాధిత ప్రాంతాల ప్రజలు ఇళ్లు కట్టుకుంటామని ముందుకు వస్తే తొలుత వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి పక్కాగృహాలు మంజూరు అయ్యేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈలకు సూచించారు. పారిశుధ్యం విషయంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర



ఉలవపాడు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

క్ష్యం వహించ వద్దని, ముఖ్యంగా ఉలవపాడులో పారిశుధ్యంపై దృష్టిసారించాలని కార్యదర్శికి సూచించారు. ఇదే విషయమై మండలంలోని పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలని, సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధిలో భాగసామ్యులు కావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో బీ సురేష్, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో శుక్రవారం ఆయన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, సీజనల్ వ్యాధులకు అవసరమైన అన్నిరకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని నిర్దేశించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి రూ. 25 లక్షల వరకు ఉచిత ఆరోగ్యబీమా అందించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వ లక్ష్యసాధనకు సిబ్బంది కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పి రమేష్, సీహెచ్‌ఓ జి శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా కందుకూరు సబ్ డివిజన్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం అని, పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సేవా కార్యక్రమాలలోనూ ముందుండటం అభినందనీయమన్నారు. డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు విద్యార్థినీ, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయటం ద్వారా తమ ప్రయత్నాన్ని విజయవంతం చేశారని అభినందించారు. కార్యక్రమంలో సీఐ అన్వర్‌బాషాతో పాటు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. శుక్రవారం సాయంత్రం పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పట్టణ పోలీసు స్టేషన్ వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలి : ఎంపీడీవో

వలేటివారిపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, నేకునాపురం గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల మూమెంట్ రిజిస్టరు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. సకాలంలో హాజరుకాని ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమయపాలన పాటించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



పెదపవని గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

లింగసముద్రం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కె కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పెదపవని గ్రామంలో పౌర హక్కులపై సమావేశం నిర్వహించారు. ప్రజలు ఈ సందర్భంగా ఆయన పౌరహక్కుల చట్టం గురించి ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం రమణయ్య, ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమ సంక్షేమ అధికారి సీహెచ్ శ్రీనివాసులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సాయంత్రం విద్యార్థినీ, విద్యార్థులు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కంచె లేని ఆనకట్ట

● పొంచి ఉన్న ప్రమాదం

ఉదయగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఉదయగిరి ఆనకట్ట అలుగు పారుతుండడంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ఆనకట్టపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఆనకట్ట చుట్టూ ఏలాంటి రక్షణ కంచె లేకపోవడం, పలుచోట్ల కట్ట దెబ్బతిని, బురదమయంగా ఉండడంతో ఆదమరిస్తే వాహనాలు ఆనకట్ట నీటిలో పడే ప్రమాదం ఉంది. దీనికితోడు కట్టకు సమీపంలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.





ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కల్చరల్ ఫెస్ట్‌లో సందడి చేసిన తెలుగు ఇండియన్ ఐడల్ ఫైనలిస్టులు

'ప్రకాశం' కల్చరల్ ఫెస్ట్‌లో

ఇండియన్ ఐడల్ ఫైనలిస్టుల సందడి

కందుకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం సందడిగా జరిగింది. ఈ ఫెస్ట్‌లో ఆహా ఓటీటీ వేదికపై సంచలనం సృష్టించిన తెలుగు ఇండియన్ ఫైనలిస్టులు ధీరజ్, పవన్‌కల్యాణ్, బృంద, శ్రీష్టి ముఖ్య అతిథులుగా పాల్గొని తమ గానంతో సందడి చేశారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినీ, విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపి చదువుపై మరింత దృష్టిపెట్టేందుకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, కల్చరల్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టరు పావని, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

తొలగిన లోఓల్టేజ్ సమస్య



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అరవపాలెం గ్రామంలో ఓల్టేజ్ సమస్య తొలగిందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. బోగోలు పంచాయతీ అరవపాలెంలో అదనపు లోడ్ కలిగిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నేత భోగిరి ప్రభాకర్ మాట్లాడుతూ లో ఓల్టేజ్ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతుండేవారన్నారు. సమస్యను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకుపోగా విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడారన్నారు. మండల విద్యుత్ అధికారి జడరాయ వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారన్నారు.

వర్షాలతో అధ్వానంగా పీఎస్ రోడ్డు

కలువాయి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు పొదలకూరు- సోమశిల మెయిన్ రోడ్డు అధ్వానంగా తయారైంది. కలువాయి పట్టణంలో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుపై ఉన్న గుంతలను కనీసం మట్టితోనైనా నింపి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



పౌర హక్కులపై అవగాహన అవసరం

అల్లూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్ కుమార్ అన్నారు. అల్లూరు మండలం బట్రకాగొల్లు గ్రామంలో శుక్రవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పౌరుడికి రాజ్యాంగంలో స్వేచ్ఛగా బతికేందుకు హక్కు ఉందని, ఆ హక్కుకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరమన్నారు. హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రనాథ్, సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

కావలి, అక్టోబరు31ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తున్న ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం కావలి పట్టణంలో ఘనంగా జరిగింది. సీపీఐ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జెండాలను సీపీఐ నాయకులు ఆవిష్కరించారు. 1920లో ఆవిర్భవించిన నాటి నుంచి ఏఐటీయూసీ 44 రకాల కార్మిక చట్టాలకు రూపశిల్పిగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. నాలుగు లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేసి, 44 రకాల కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండ్లూరి ఆదినారాయణ. మల్లె అంకయ్య, టీ. వెంకటేష్, కే. నాగరాజు, ఎం. వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, కే. కొండయ్య, పీ. బోస్, రవి, ప్రభావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఏపీజీబీ మేనేజర్

కావలి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అవినీతి వ్యతిరేక చట్టాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కేవీ సుబ్బారెడ్డి సూచించారు. కావలి మండలం తుమ్మలపెంట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్ సభ్యులు మాలకొం డారెడ్డి మాట్లాడుతూ సామాజిక పురోగతికి అవినీతి ప్రధాన అవరోధమన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. లంచం ఇవ్వటం, తీసుకోవటం రెండూ నేరమేనన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారిణి శ్రావణి, మహేంద్ర పాల్గొన్నారు.



అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న బ్యాంక్ అధికారులు, తదితరులు

రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సబ్‌జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ.హరీష్, గంటా సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో 60 కేజీ, బాలికల విభాగంలో 55 కేజీ కేటగిరిలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలోనే ఒక సంచలన తీర్పు వెలువడింది. చిత్తూరు మొదటి మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్య కేసులో ఐదుగురికి చిత్తూరు కోర్టు శుక్రవారం ఉరి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 2015 నవంబరు 17న కఠారి అనురాధ, మోహన్ దంపతుల్ని నగరపాలక సంస్థ కార్యాలయంలోనే క్రూరంగా హత్య చేశారు. పదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం శుక్రవారం ఉదయం 10:50 గంటలకు న్యాయమూర్తి శ్రీనివాసరావు తుది తీర్పు ప్రకటించారు.

- చిత్తూరు లీగల్, ఆంధ్రజ్యోతి



ఇదీ తీర్పు!

- ఏ1 నుంచి ఏ5 దాకా చింటూ, వెంకటా చలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌లకు ఉరిశిక్ష.
- ఏ1 చింటూ బాధిత కఠారి కుటుంబీకులకు రూ.50 లక్షలు, గాయపడిన సతీష్‌కు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలి.
- ఏ2, ఏ3, ఏ4, ఏ5లకు రూ.11,500 చొప్పున జరిమానా.

సాక్షులకు నోటీసులు

పోలీసుల విచారణలో చెప్పిన వాంగ్మూలాన్ని కోర్టులో చెప్పకుండా అబద్ధం చెప్పిన 9 మంది సాక్షుల నుంచి సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయాలని కోర్టు సిబ్బందిని న్యాయమూర్తి ఆదేశించారు.

కఠారి దంపతుల హత్య కేసులో 5 గురికి ఉరి

శిక్ష ప్రకటించిన న్యాయమూర్తి



వెంకటాచలపతి | జయ ప్రకాష్‌రెడ్డి | చింటూ | మంజునాథ్ | వెంకటేశ్

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం
- గాయపడిన ప్రత్యక్ష సాక్షికి రూ.20 లక్షలు ఇవ్వాలని ఆదేశం

కేసులో నిందితులు: శ్రీరామచంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు 22 మంది.

సాక్షులు: 133 మంది. విచారించింది 57 మందిని

బెయిల్: చింటూ, జయప్రకాష్, మంజునాథ్ మినహా మిగిలినవారికి హైకోర్టు షరతులతో కూడిన బెయిళ్లను మంజూరు చేసింది. ప్రధాన నిందితుడు చింటూకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చింది. జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్‌లకు బెయిల్ రాకపోవడంతో రిమాండ్ ఖైదీలుగా కోర్టు వాయిదాలకు హాజరయ్యేవారు.

352 వాయిదాలు:

2015 ఫిబ్రవరి 16న చిత్తూరు ఒకటవ పట్టణ పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి ఈ కేసుకు సంబంధించి 355 వాయిదాలు జరిగాయి. కొన్నిసార్లు నిందితులు నేరుగా కోర్టుకు హాజరుకాగా... ఇంకొన్నిసార్లు జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాయిదాలకు హాజరయ్యారు. ఈ పదేళ్ల కాలంలో కఠారి దంపతుల హత్య కేసు రకరకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది.2025 నవంబరు 10వ తేదిలోపు తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా కోర్టు సాక్షుల విచారణను వేగవంతం చేసి శుక్రవారం శిక్షలు ఖరారు చేస్తూ తీర్పు ప్రకటించింది.

కేసు.. సెక్షన్లు..

హత్య జరిగిన సమయంలో ప్రత్యక్ష సాక్షి సతీష్‌కుమార్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పటి వన్ టౌన్ సీఐ నిరంజన్‌కుమార్ పలు సెక్షన్ల కింద 130-2015 నెంబరుతో కేసు పెట్టారు. 147, 148, 302, 307, 326, 120-బీ, 109 రెడ్‌విత్ 149, ఐపీసీ సెక్షన్ 212, 216, 201, ఐపీసీ సెక్షన్ 25 (1ఏ), సెక్షన్ 25 (1ఏఏ), సెక్షన్ 25 (1బీ)(ఏ), సెక్షన్ 25 (1బీ)(సీ), సెక్షన్ 27 (3) అండ్ సెక్షన్, 30ఆఫ్‌ది ఆర్మ్స్ యాక్ట్ 1959 కింద కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. అప్పటి ఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ లక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు సాగింది. 69 మంది వాంగ్మూలాలను నమోదు చేశారు. ఏ2 నుంచి ఏ23 వరకు ఉన్న నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. 22వ నిందితుడైన శ్రీకాళహస్తికి చెందిన కాసరం రమేష్‌ను విచారణ సమయంలోనే కోర్టు డిశ్చార్జ్ చేసింది. 21వ నిందితుడు శ్రీనివాసాచారి వయసైపోయి మరణించాడు.

తుది తీర్పు.. వారం రోజుల ఉత్కంఠ

పదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నెల 24వ తేదీన ఈ కేసు తుది దశకు చేరుకుంది. ఈ కేసులో ఉన్న నిందితులంతా కోర్టుకు వచ్చారు. ఏ1 నుంచి ఏ5 వరకు నిందితులపై శిక్ష ఖరారైందని, మిగిలినవారిపై కేసు కొట్టేస్తున్నట్లు కోర్టు తీర్పు ఇచ్చింది. శిక్ష పడ్డ చింటూ, వెంకటా చలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌లను కస్టడీలోకి తీసుకోవాలని ఆరవ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీనివాసరావు ఆదేశించారు. ఐదుగురిపై తుది తీర్పును 30వ తేదీకి వాయిదా వేశారు. 30న చింటూ తరపు న్యాయవాది విజయచంద్రారెడ్డి పలు కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పుల పత్రాలను జిల్లా న్యాయమూర్తికి అందించారు. నాలుగు గంటల సేపు వాదనల్ని వినిపించారు. పీపీ శైలజ కూడా కోర్టుకు తమ వాదనల్ని వినిపించారు. అలాగే వైద్యాధికారులు, జైలు సూపరింటెండెంట్, పోలీసులు, మానసిక వైద్యులు వేర్వేరుగా ఇచ్చిన నివేదికలను న్యాయమూర్తి పరిశీలించారు. తీర్పును శుక్రవారం వెల్లడిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పోలీసులు కోర్టు పరిధిలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. కక్షిదారులను కూడా అనుమతించలేదు. మీడియా సిబ్బందిని కూడా పరిమితంగానే లోపలికి పంపించారు.



పదేళ్ల నిరీక్షణకు ఫలితం

మా అత్తామామలు కఠారి అనురాధ, మోహన్ హత్యకు కారణమైన చింటూతో పాటు మరికొంతమందిపై కేసు వేశాం. పదేళ్లపాటు ఈ కేసు నడిచినా ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందనే నమ్మకంతోవేచివున్నాం.ఈ పదేళ్లలో ఆర్థికంగా, రాజకీయంగా అష్టకష్టాలు పడ్డాం.కుటుంబ పెద్దల్ని పోగొట్టుకుని అనాథల్లా మిగిలాం.అయినప్పటికీ అత్తామామలను చంపిన వారికి శిక్షపడాలని కోర్టుల చుట్టూ తిరిగాం. అంతిమంగా న్యాయమే గెలిచింది.మా కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు టీడీపీ అండగా నిలిచింది.

- కఠారి హేమలత,అనురాధ కోడలు



న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగింది

అమ్మానాన్నలను పోగొట్టుకుని చాలా కోల్పోయాం. చంపిన వారికి శిక్ష పడాలని కోర్టు చుట్టూ తిరిగాం. దేవుడి రూపంలో న్యాయస్థానం మాకు న్యాయం చేసింది. మొదటి నుంచి మాకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది. ఆ నమ్మకం ఈ రోజు రుజువైంది.

- లావణ్య, అనురాధ కుమార్తె



సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

కేసు విచారణ ప్రారంభమైనప్పటి నుంచి నాకు సహకరించిన ఉన్నత స్థాయి అధికారులకు, పోలీసులకు, కోర్టు మానిటరింగ్ అధికారికి, సిబ్బందికి కృతజ్ఞతలు. సకాలంలో సాక్షులను కోర్టుకు హాజరుపరచడం సంతోషకరమైన విషయం,

- పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ

ఆ రోజు ఏం జరిగిందంటే..

తేదీ: 2015 నవంబరు 17

స్థలం: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

సమయం: ఉదయం 11:45 గంటలు

చింటూ, వెంకటాచలపతి బురఖా ధరించి కార్యాలయం లోపలికి వెళ్లారు. వారిద్దరి వెంట జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్ ఉన్నారు. ఐదుగురూ మేయర్ ఛాంబర్‌లోకి వెళ్లారు. చింటూ ముఖానికి ఉన్న బురఖాను తీసి నేనే చింటూనంటూ గట్టిగా అరిచాడు. వెంట తెచ్చుకున్న లేడీస్ హ్యాండ్ బ్యాగులోంచి పిస్టల్ బయటకు తీశాడు. తననేం చేయొద్దంటూ అనురాధ భయంతో గట్టిగా అరిచారు. మేయర్ అనురాధను పాయింట్ బ్లాంక్‌లో కాల్చాడు. ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.

కఠారి మోహన్ అక్కడి నుంచి పరిగెత్తేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పీఏ రూమ్ వద్ద వెంకటేష్ కత్తితో నరకడంతో ఆ గాయంతోనే మోహన్ కేకలు పెడుతూ కాన్ఫరెన్సు హాల్లోకి పరిగెత్తారు. అక్కడ మంజునాథ్ కత్తితో కడుపులో పొడవగా జయప్రకాష్‌రెడ్డి కూడా నరికాడు. చింటూ, వెంకటాచలపతి పిస్టళ్లతో కాల్పులు జరిపినా మోహన్‌కు తగల్లేదు. ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసేందుకు వెంకటాచలపతి ఎయిర్ గన్ (డమ్మీ గన్)తో కాల్పులు జరిపాడు. మోహన్‌కు బుల్లెట్ తగల్లేదు.

సతీష్‌కి గాయాలు: మేయర్ ఛాంబర్‌లోకి చింటూ వచ్చినప్పుడు సతీష్ అనే వ్యక్తి అంతకుముందే మేయర్‌తో పని ఉండి వచ్చాడు. మేయర్ దంపతులను కాపాడే ప్రయత్నం చేయగా, మంజునాథ్ అతడి వీపు మీద కత్తితో దాడి చేశాడు. దీంతో సతీష్ కూడా అక్కడే గాయాలతో పడిపోయాడు. ఆ తర్వాత వారు ఇంజనీర్ రూమ్ పక్కనున్న గోడ దూకి పారిపోయారు.

అనురాధ, మోహన్, సతీష్‌లను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అప్పటికే అనురాధ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మోహన్, సతీష్‌లను వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. మోహన్ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించారు. బతికి బయటపడ్డ సతీష్ ఈ కేసులో ప్రధాన సాక్షిగా నిలిచారు.

హత్య చేసి పోలీసుల వద్దకు..

హత్య జరిగిన రోజు మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్ చిత్తూరు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తమకు కఠారి మోహన్ అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు ఆ ముగ్గుర్నీ గంగవరం మండలంలోని మారేడుపల్లెలో ఉన్న మంజునాథ్ ఇంట్లో తమ అధీనంలోనే పెట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో వారి హస్తం ఉందని తెలిసి 24వ తేదీన ఆ ముగ్గుర్నీ అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.

లొంగిపోయిన చింటూ: అదే నెల 30వ తేదీన చిత్తూరు నాలుగో కోర్టులో చింటూ లొంగిపోయారు. రిమాండుకు పంపించారు. మరో రెండు మూడు రోజుల్లో వెంకటేష్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

నేరస్థుల్లో కనిపించని భయాందోళన



చింటూను కడప జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

చిత్తూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉరిశిక్ష పడిన ఐదుగురు నేరస్థుల్లో ఎలాంటి భయాందోళనా కనించలేదు. జడ్జి ఉరిశిక్ష వేస్తూ తీర్పు చెప్పిన సమయంలో ఐదుగురు నేరస్థులూ కోర్టు హాలులో ఉన్నారు. ఆ సమయంలో వారిలో ఎలాంటి అలజడి కనిపించలేదు. ఏ5 వెంకటేష్ మాత్రం కాస్త కలత చెందినట్లు కనిపించారు. మిగిలినవారిలో ఎలాంటి రియాక్షన్ లేదు. చింటూ అనుచరులు మినహా మిగిలినవారి కుటుంబీకులు, బంధుమిత్రులు కోర్టు వద్దకు రాలేదు. చింటూ తల్లి కూడా వయసు మీద పడడం, అనారోగ్యం కారణంగా బెంగుళూరులోని మరో కుమారుడి వద్ద ఉంటున్నారు. ఆమె కూడా ఇక్కడికి రాలేదు.శిక్ష పడిన ఐదుగురినీ పోలీసులు కస్టడీకి తీసుకుని వ్యాన్లో కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఆ సమయంలో చింటూ కోర్టు హాలు నుంచి కింద ఉన్న వ్యాను ఎక్కేందుకు వస్తూ అక్కడ కనిపించిన అనుచరులకు నవ్వుతూ చెయ్యి ఊపి వ్యాన్ ఎక్కాడు.



జూలో వాలాబీ మృతి

వాలాబీ (ఫైల్ ఫొటో)

మంగళం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో శుక్రవారం ఎర్రమెడ గల మగ వాలాబీ అనారోగ్యంతో మృతి చెందినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. 'ఈ ఏడాది ఆగస్టు 27న గుజరాత్‌కు చెందిన రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు ఒక జత మీర్‌కాట్స్, ఒక జత కామన్ మార్మోసెట్స్‌తో పాటు ఒక ఎర్రమెడగల వాలాబీని జూపార్కుకు విరాళంగా ఇచ్చారు. అప్పట్నుంచి వీటిని సంజీవని కార్వంటైన్‌లో ఉంచాం. గురువారం ఉదయం నుంచి వాలాబీ అనారోగ్యంతో ఆహారం తీసుకోవడం మానేసింది. జూ వైద్యసిబ్బంది దీనిని ఐసీయూలోఉంచి వైద్యం చికిత్స చేసినా.. శుక్రవారం మృతి చెందింది. కళేబరాన్ని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పెథాలజీ విభాగ ప్రొఫెసర్ల బృందం పోస్టుమార్టం నిర్వహించి టాక్సో ప్లాస్మోసిస్ సమస్యతో మృతి చెందిందని నిర్ధారించారు' అని క్యూరేటర్ తెలిపారు. వాలాబీతో పాటు తీసుకొచ్చిన మిగిలిన జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయన్నారు.

త్వరలో 'శ్రీవారి వైద్య సేవ'

- టీటీడీ ఆసుపత్రుల్లోని రోగులకు శ్రీవారి సేవకుల సేవలు
- ఈవో సింఘాల్



తిరుమల, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్పత్రుల్లో భక్తులు స్వచ్ఛంద సేవ అందించేలా 'శ్రీవారి వైద్యసేవ'ను త్వరలోనే ప్రారంభించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు. శ్రీవారి సేవపై శుక్రవారం ఆయన తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో సమీక్షిస్తూ ఈ సూచన చేశారు. తిరుపతి, తిరుమలలోని ఆయుర్వేద, స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల, అశ్విని ఆస్పత్రుల్లో రోగులకు సేవ చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఇందుకోసం శ్రీవారి వైద్యసేవా సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఐఐఎం అహ్మదాబాద్, రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ శాఖకు సంబంధించిన ముఖ్యమైన శిక్షకులతో నవంబరులో శ్రీవారి సేవకులకు శిక్షణ ఉంటుందని, దీనికి సంబంధించిన ఆడియో, వీడియో విజువల్స్ ట్రైనింగ్ మెటీరియల్ సిద్ధం చేయాలన్నారు.

శ్రీవారి సేవకుల గోసేవ

ఎస్వీ గోసంరక్షణశాలలోనూ శ్రీవారి సేవకులు గోసేవ చేయడానికి వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దేశంలోని టీటీడీ ఆలయాల్లోనూ శ్రీవారి సేవకులతో భక్తులకు సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, వైజాగ్, కన్యాకుమారి, బెంగుళూరు వంటి ప్రాంతాల్లో ఉన్న శ్రీవారి ఆలయాల్లో మొదటివిడతగా శ్రీవారి సేవను ప్రారంభించాలన్నారు. అనంతరం మిగతా ఆలయాల్లో దశలవారీగా శ్రీవారిసేవను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీపీఆర్వో రవిని ఆదేశించారు. ఈ సమీక్షలో ఐటీ జీఎం పణికుమార్ నాయుడు, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద, అశ్విని సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమ కుమారి, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, ఐఐఎం ప్రతినిధులు, రాష్ట్ర ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నేడు 2,62,385 మందికి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి జిల్లా అధికారులతో ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. నిర్దేశిత సమయానికే పింఛన్లు అదించాలన్నారు. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించినా, ఆలస్యంగా పంపిణీ చేసినా ఉపేక్షించేది లేదన్నారు. గత నెలలో పింఛన్లు ఆలస్యంగా పంపిణీ చేసిన వారికి షోకాజు నోటీసులు అందించామని గుర్తుచేశారు. జిల్లాలో 2,62,385 మంది పింఛనుదారులకు రూ.112 కోట్ల నగదు పంపిణీ చేయనున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల సమైక్యతా పరుగు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యాన సమైక్యతా పరుగు (రన్ ఫర్ యూనిటీ) తీశారు. పోలీసు పరేడ్ మైదానం నుంచి ఎంఆర్‌పల్లె సర్కిల్ వరకు విద్యార్థులు, పోలీసులు, నగర ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు పటేల్ చిత్ర పటానికి అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశమంతా ఒక్కటే అనే భావనను ప్రజల్లో పెంపొందించడమే ఈ ర్యాలీ ఉద్దేశమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు.

రుయాలో 152 మందికి షోకాజు నోటీసులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రుయాస్పత్రిలో పారిశుధ్యం, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్లో పనిచేసే 152 మందికి సూపరింటెండెంట్ రాధ శుక్రవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. వీరు ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం)లో హాజరు సకాలంలో వేయకపోవడాన్ని ఆమె గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు సకాలంలో వేయని వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు ఆధారంగానే జీతాలు అందుతాయని లేకపోతే ఆ రోజుటి జీతం అందదన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.48 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 56,078

తలనీలాలు సమర్పించినవారు: 17,539



ముక్కంటికి బంగారు కాసుల దండ వితరణ

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఇందిర రూ.9.32లక్షల విలువైన 96గ్రాముల బంగారు కాసుల దండ, 650గ్రాముల వెండి బిందెను వితరణ చేశారు. వీటిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామిఅమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.



ఈవో బాపిరెడ్డికి బంగారు కాసుల దండ అందజేస్తున్న ఇందిర

కొండెక్కుతూ.. భజనలు చేస్తూ..

● ఘనంగా శ్రీవారి మెట్లోత్సవం



పాదాల మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద శుక్రవారం శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ఘనంగా జరిగింది. పాదాల మండపం వద్ద పూజలు చేసి, కర్పూర హారతులిచ్చారు. పూర్వం నుంచీ ఎందరో మహనీయులు మెట్లమార్గంలో తిరుమల వెళ్లారని.. ఇలాంటి మెట్లోత్సవంలో పాల్గొనడం పుణ్యఫలంగా భావిస్తున్నట్లు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. భజన మండలి సభ్యులతో కలిసి గోవిందనామ భజనలతో సప్తగిరులను అధిరోహిస్తున్నట్లు దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు చెప్పారు. 3,500 మంది భజన మండలి సభ్యులతో కలిసి మెట్ల మార్గం గుండా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.



భజన మండలి కళాకారులు



అతుల్ సింగ్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఏసీబీ డీజీ అతుల్ సింగ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

డ్రంకెన్ డ్రైవ్‌లో 41 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 41 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జ్యుడిషియల్ కోర్టు న్యాయమూర్తి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న దాదాపు 70 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 41 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగించిన 12 మందికి రూ.500 వంతున జరిమానా విధించారు.

గుంపులుగా వెళ్లండి

● శ్రీవారిమెట్టు మార్గంలో మరోసారి చిరుత కలకలం

చంద్రగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లే శ్రీవారిమెట్టు మార్గంలో చిరుత సంచారంతో కలకలం రేగింది. శుక్రవారం ఉదయం 150వ మెట్టు వద్ద అటవీ ప్రాంతంలోకి చిరుత దాటుతుండగా భక్తులు చూసి భయాందోళనకు గురై కేకలు వేయడంతో పారిపోయింది. అనంతరం భక్తులు టీటీడీ సెక్యూరిటీకి సమాచారమిచ్చారు. టీటీడీ సెక్యూరిటీ అప్రమత్తమై భక్తులను గుంపులు గుంపులుగా తిరుమలకు అనుమతించారు. చిన్న పిల్లలను జాగ్రత్తగా తీసుకెళ్ళాలని సూచించారు. అటవీ అధికారులు ఆప్రాంతంలో ప్రత్యేక ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గతంలోనూ 2024 సెప్టెంబరులో, ఈ ఏడాది జూన్‌లోనూ ఈ మార్గంలో చిరుత సంచరించింది. ఈనేపథ్యంలో చిన్న పిల్లలున్న భక్తులను మధ్యాహ్నం 2 గంటల వరకే శ్రీవారి మెట్టు మార్గంలో అనుమతిస్తున్నారు. టీటీడీ అధికారులు శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్ళే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలంటూ సూచిస్తున్నారు.



మూడు కేసుల్లో ఏడుగురికి

● ఇప్పటిదాకా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉరిశిక్ష విధిస్తూ తీర్పులు



స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలో ఒకేసారి ఐదుగురికి ఉరి శిక్ష పడిన ఘటనగా కఠారి మోహన్ దంపతుల కేసు నిలిచిపోతుంది. దీంతో కలిపి ఇప్పటి వరకు మూడు కేసుల్లో ఉరిశిక్ష విధిస్తూ న్యాయమూర్తులు తీర్పులిచ్చారు.

2020 ఫిబ్రవరి 24: కురబలకోట మండలం అంగళ్లులో ఓ పెళ్లికి వచ్చిన ఆరేళ్ల చిన్నారిపై లారీ క్లీనర్ పఠాన్ మహ్మద్ రఫీ(27) అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి మృతి చెందింది. 2019 నవంబరు 7న జరిగిన ఈ ఘటనపై చిత్తూరు కోర్టు ఉరిశిక్ష విధించింది. దీనిని హైకోర్టును జీవిత ఖైదుగా మార్చడంతో నిందితుడు కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

2023 ఆగస్టు 22: తంబళ్లపల్లె మండలం ఏటిగడ్డ తాండాకు చెందిన తల్లీ కూతుళ్లతో వివాహేతర సంబంధం పెట్టుకుని హతమార్చడం.. ఓ బాలికపైనా అత్యాచారానికి పాల్పడిన కేసులో మదనపల్లె ఫస్ట్ ఏడీజే కోర్టు మౌలాలికి ఉరిశిక్ష విధించింది. నిందితుడు హైకోర్టుకు అప్పీలు చేయగా విచారణ పెండింగులో ఉంది.

అంత ఈజీ కాదు!

సాధారణంగా జిల్లా కోర్టులు విధించే ఉరిశిక్షలకు హైకోర్టు ఆమోదం తప్పనిసరి. ఆలోపు నిందితులు హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. దీనిపై హైకోర్టు విచారించి మెరిట్స్‌ను బట్టి కింది కోర్టు వేసిన శిక్షను ఖరారు చేయచ్చు. లేదా జీవిత ఖైదుగా మార్చవచ్చు. మెరిట్స్ లేవని భావిస్తే శిక్షనే రద్దు చేయచ్చు. ఒకవేళ హైకోర్టు కూడా కింది కోర్టు తీర్పునే ఖరారు చేస్తే నిందితులకు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశముంది. అంతిమంగా సుప్రీంకోర్టు కూడా ఉరిశిక్షను ఖరారు చేస్తే నిందితులకు మిగిలిన ఏకైక అవకాశం రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకోవడమే. రాష్ట్రపతి కరుణించి శిక్షను రద్దు చేయడం లేదా, తీవ్రతను తగ్గించే నిర్ణయం తీసుకోవచ్చు. లేదా క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించనూ వచ్చు. అలా తిరస్కరిస్తే నిందితులకు అన్ని దారులూ మూసుకుపోయినట్టే.

ఉరిశిక్ష పడిన నేరస్తులు సెంట్రల్ జైలుకే

రాష్ట్రంలో ఏ కోర్టు ఉరిశిక్ష వేసినా నేరస్తులను నెల్లూరు, కడప, రాజమండ్రి, విశాఖల్లోని ఏదేని ఒక సెంట్రల్ జైలుకు పంపిస్తారు. ఉరిశిక్ష అమలయ్యేదాకా లేదా పైకోర్టులు ఆ శిక్షను రద్దు చేయడం లేదా మార్చడం చేసే దాకా అక్కడే ఉంచుతారు.

ఉరిశిక్ష అమలయ్యేది రాజమండ్రిలోనే

రాష్ట్రంలో ఎవరికి ఉరిశిక్ష పడినా అమలు చేసే సదుపాయం ఉండేది రాజమండ్రి సెంట్రల్ జైలులోనే. అక్కడ ఇద్దరు తలారులు అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలో చివరగా ఉరిశిక్ష అమలు చేసింది 1978లో అని తెలుస్తోంది. ఆ తర్వాత ఎవరినీ ఉరి తీయలేదని జైళ్లశాఖ వర్గాలు చెబుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అన్నప్రసాదం ట్రస్టుకు 6 నెలల్లో రూ.180 కోట్ల విరాళాలు

తిరుమల, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): వెంగమాంబ అన్నప్రసాద ట్రస్టుకు భక్తుల నుంచి ఆరు నెలల కాలంలో రూ. 180 కోట్లు విరాళంగా అందాయి. అంటే సగటున రోజుకు కోటి రూపాయలు ఈ ఒక్క ట్రస్టుకే భక్తులు సమర్పిస్తున్నారు. శ్రీనివాసుడి సమక్షంలో అన్నదానం అన్నది గొప్ప పుణ్యకార్యక్రమం కావడంతో విశేషంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే ఈ ట్రస్టు వద్ద రూ.2,300 కోట్లు డిపాజిట్లు రూపంలో ఉన్నాయి. ఈ మొత్తం మీద వచ్చే వడ్డీతోనే ప్రస్తుతం అన్నదాన కార్యక్రమం జరుగుతోంది. అన్నప్రసాదకేంద్రంలో ఆయుధ పూజ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటిస్తూ టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఈ వివరాలు తెలిపారు. 1985లో అన్నదాన కార్యక్రమం తిరుమలలో ప్రారంభించగా 1994లో శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా మారి సేవలందిస్తోంది.

టీటీడీ ఆలయాలన్నింటిలోనూ అన్నదానం వెంగమాంబ భవనంతో పాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, బయట ఫుడ్ కౌంటర్ల ద్వారా కూడా అన్నప్రసాదాలు అందిస్తున్నారన్నారు. త్వరలో టీటీడీ అనుబంధ ఆలయాల్లోనూ రోజువారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం శ్రీవాణి ట్రస్టు నిధులను వినియోగిస్తామన్నారు.

అన్నప్రసాద భవనంలో ఆయుధపూజ

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో శుక్రవారం ఆయుధపూజ జరిగింది. అన్నప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలు, పాత్రలకు పూజలు చేశారు. అనంతరం అన్నదానం సిబ్బందిని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సత్కరించారు. కిచెన్‌తో పాటు కూరగాయలు నిల్వచేసే ప్రాంతాలను ఈవో పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కాగా కిచెన్ ఆధునీకరణ సమయంలో చేయనున్న తాత్కాలిక ఏర్పాట్ల గురించి అధికారులు ఈవోకు వివరించారు.



విజిబుల్ పోలీసింగ్

● సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు రోడ్లపై ఉండాలి

● కమ్యూనిటీ వ్యవస్థ బలోపేతానికి పటిష్ఠ ప్రణాళిక

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌కు ఎస్పీ సుబ్బరాయుడు ప్రాధాన్యమిస్తున్నారు. నేరాల కట్టడికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ దిశగా పోలీస్ యంత్రాంగాన్ని పటిష్ఠపరిచే చర్యలు చేపడుతున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు పోలీసులు రోడ్లపైనే కనిపించాలంటూ డీఎస్పీలకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసు స్టేషన్ల వారీగా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్టీఎఫ్ పార్టీలను వెంట పెట్టుకుని ఎస్ఐలు, ఏఎస్ఐలు,పోలీసులు బృందాలుగా విడిపోయి రోడ్లపైకి వచ్చి పనిచేయాలని ఎస్పీ నిర్ణయించారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు ఎస్ఐలు వీధుల్లోకి వచ్చి ప్రజలతో కలసి పర్యటించాలని చెప్పారు. నేరాలు, దొంగతనాలు, సైబర్ నేరాలు, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ కట్టడికి గట్టిగా పనిచేసి జిల్లాను నేర రహిత ప్రాంతంగా మార్చాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ప్రజా చైతన్యంతోనే నేరాల కట్టడి సాధ్యపడుతుందని భావించిన సీఎం చంద్రబాబు ఆ దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో ఉన్న సాంకేతిక వ్యవస్థలను వాడుకుంటూనే ప్రజల భాగస్వామ్యంతో 'కమ్యూనిటీ ఫస్ట్' పేరిట విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళి ప్రచారం చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు నిర్ణయించారు. ఆర్థిక, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి.. కట్టడి చేసే దిశగా వ్యూహం రచిస్తున్నారు. మరోవైపు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు నివారించడానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.

ఆగండి.. ముఖం కడుక్కుని వెళ్లండి

మరోవైపు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరు తెన్నులపై యంత్రాంగం అధ్యయనం చేసింది. ప్రధానంగా తెల్లవారు జామున 2 నుంచి 4 గంటల మధ్య రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసు శాఖ గుర్తించింది. ఈ క్రమంలో 'కాసేపు ఆగండి.. ముఖం కడుక్కుని వెళ్లండి' అంటూ వాహనాలను ఆపి తనిఖీలు చేసి డ్రైవర్లను నిద్ర మత్తులో నుంచి మేల్కొలిపే దిశగా ఆలోచిస్తున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయితే పీఎం కిసాన్ నగదు రైతుల ఖాతాలో జమవుతుందని చెప్పారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఆర్వో నరసింహులుతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈకేవైసీ పెండింగ్, ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాలకు లింక్ కాకపోవడం, మ్యుటేషన్, రాంగ్ ఆధార్ వంటి సమస్యలతో పెండింగులో ఉన్న 57,096 దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. రెండు, మూడో విడతల్లో నగదు జమ చేసేటప్పటికి అర్హులైన రైతులను గుర్తించి లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్, సహాయ వ్యవసాయాధికారి ధనంజయరెడ్డి, కోఆపరేటివ్ అధికారిణి నాగవర్ధనమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఎరువుల సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడండి

రైతులకు ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు. పవన్, వ్యవసాయ సహాయ సంచాలకుడు ధనంజయరెడ్డి తదితరులతోసమీక్షించారు. యూరియా 7,969 టన్నులు, డీఏపీ 1,086 టన్నులు, ఎంవోపీ 527 టన్నులు, కాంప్లెక్సు 5,877 టన్నులు, ఎస్ఎస్‌పీ 1,328మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా కార్డుల ద్వారా ప్రతి రైతుకూ ఎకరాకు 3 బస్తాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

● గూడూరు ఏరియా ఆస్పత్రిలో ఘటన

గూడూరు అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏరియా ఆస్పత్రిలో గురువారం రాత్రి బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నించడంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది తెలిపిన ప్రకారం.. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి తోడుగా కుటుంబీకులు ఉన్నారు. అదే వార్డులో చికిత్స పొందుతున్న మరొకరికి తోడుగా జమీర్‌బాషా అనే వృద్ధుడు ఉన్నాడు. గురువారం రాత్రి మరో రోగి కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తున్న బాలికపై జమీర్‌బాషా లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో సిబ్బంది, స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శుక్రవారం ఎస్పీ సుబ్బరాయుడు విచారణ చేపట్టారు. 'ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నాం. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపడతాం' అని ఆయన మీడియాకు చెప్పారు. విచారణలో ఏఎస్పీ మనోహరాచారి, డీఎస్పీలు గీతాకుమారి, చెంచుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి షిఫ్ట్ ఆపరేటర్ మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కరెంటు తీగలకు మరమ్మతులు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్ కిన్నెర సాంబచిన్నయ్య (41) మృతి చెందారు. ఈ ఘటన బుచ్చినాయుడు కండ్రిగ మండలం లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం జరిగింది. నీర్పాకోట దళితవాడకు చెందిన సాంబచిన్నయ్య వెస్ట్‌వరత్తూరు సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా (ఒప్పంద ఉద్యోగి) పని చేస్తున్నారు. మొంథా తుఫానుతో లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలో పి.వెంకటసుబ్బయ్య నాయుడు మామిడి తోటలో మరమ్మతులకు గురైన విద్యుత్ వైర్లను సరి చేయడానికి శుక్రవారం ఉదయం 8గంటలకు వెళ్లారాయన. విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ వైర్లు తలపై తగలడంతో మృతి చెందారు. ఉదయం 9గంటల నుంచి ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో సహ ఉద్యోగి సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ సాంబ చిన్నయ్య మృతి చెంది ఉన్నారు. ఆయన కుటుంబీకులకు, డిస్కం ఏఈ చలపతికి ఆయన సమాచారమిచ్చారు. ఎస్ఐ హరిప్రసాద్‌కు ఏఈ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సాంబచిన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గతంలో ఒకసారి విద్యుదాఘాతానికి గురై కోలుకున్నారు.

అత్తి వరదరాజస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో అత్తి వరదరాజ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలుజరుగుతున్నాయి. ఇందులోభాగంగా శుక్రవారం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకు ముందు పలురకాల హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఋత్విక్కుల హోమం



స్వామివారిని దర్శించుకుంటున్న ఈవో తదితరులు

భాగస్వామ్యంతో పాలన అనుసంధానం సాధ్యం

తిరుపతి ఐఐటీలో క్రిస్ప్ భాగస్వామ్యంతో జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం

ఏర్పేడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భాగ స్వామ్యం ద్వారా విద్యా సిద్ధాంతాలు, పాలన అంశాల మధ్య అనుసంధానం సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరుపతి లోని ఐఐటీ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం, సెంటర్ ఫర్ రీసెర్చి ఇన్ స్కీం అండ్ పాలసీస్(క్రిస్ప్) సంయుక్తంగా మూడు రోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్ పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టీస్‌ను అక్టోబరు 30 నుంచి నవంబరు 1 వరకు నిర్వహిస్తోంది. తిరపతి ఐఐటీ ప్రాంగణంలో అక్టోబరు 30న అధికారికంగా ప్రారంభించినప్పటికీ 31న నిపుణుల చర్చలు జరిగాయి. ఈ వర్క్‌షాప్‌లో ప్రజా విధానాల రూప కల్పన, అమలులో విశిష్ట సేవలందించిన ఐఏఎస్ అధికారులు, అకడమిక్ నిపుణులు, పరిశోధకులు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటున్నారు. ఈ వర్క్‌షాప్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎస్ఎం విజయా నంద్, సుబ్రహ్మణ్యం, ఆర్ఎస్ జులానియా, రాజీవ్ సదానందన్, ఎస్‌జే కుంటే, చంద్రమౌళి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఈ తరహా వర్క్‌షాప్‌లతో అనుభవాత్మక అభ్యాస్యాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. అదే విధంగా క్రిస్ప్ సీఈవో ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... భాగస్వా మ్యం డేటా ఆధారిత పాలనకు మార్గం శుభం చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, పాలన, నిపుణులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపంలో ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ప్రజా విధానాల అనుభవాలపై పెరుగుతున్న ఆసక్తిని వర్క్‌షాప్ ప్రతిబింబించింది.

ప్రధాన చర్చలు

ఈ వర్క్‌షాప్‌లో పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, జనాభా గణాంకాలు, నైపుణ్యాధారిత ఉన్నత విద్య వంటి ప్రధాన అంశాలపై చర్చలు జరిగాయి. విద్యార్థులు ప్రజా విధానాల రూపకల్పన, అమలులో ప్రయోగిక అవగాహన పొందేందుకు నిపుణులు మార్గదర్శకత్వం వహించారు.

ఐఐటీ తిరుపతి-క్రిస్ప్ ఒప్పందం

వర్క్‌షాప్ తొలిరోజు ఐఐటీ తిరపతి, క్రిస్ప్ మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యానికి అవగాహన ఒప్పందం కుదిరింది. దీనిపై తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, క్రిస్ప్ కార్యదర్శి, సీఈవో సుబ్రహ్మణ్యం సంతకాలు చేశారు.విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయానంద్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ భాగస్వామ్యం ద్వారా ప్రజా విధానాల బోధన, పరిశోధన, డేటా ఆధారిత పాలనలో రెండుసంస్థలు కలిసి పని చేయనున్నాయి.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, క్రిస్ సీఈవో సుబ్రహ్మణ్యం

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయం



రైతులకు యూరియా అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు, అక్టోబరు, 31(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం చిల్లకూరు సొసైటీ గోడౌన్‌లోని యూరియా పంపిణీ కేంద్రంలో ఏవో విజయభారతి, చిల్లకూరు పీఏసీఎస్ చైర్మన్ కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడుతో కలిసి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి మూడు బస్తాల యూరియా అందజేస్తున్నట్లు తెలిపారు. పారదర్శకంగా టోకెన్ విధానంలో యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకూ సరిపడా యూరియా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అశోక్, సొసైటీ సిబ్బంది నెలవల లోకేష్, టీడీపీ నాయకులు భైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, రాధానాయుడు, హరినాయుడు, కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

పేరం రమేష్‌ను పరామర్శించిన నెలవల



రమేష్‌నాయుడిని పరామర్శిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, అక్టోబరు, 31(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు గ్రామానికి చెందిన స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడును సూళ్లూరుపేట నియోకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన రమేష్ నాయుడును చికిత్స అనంతరం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. నెలవల సుబ్రహ్మణ్యం పెళ్లకూరులోని రమేష్ నాయుడు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నెలవల వెంట టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు శిరసనం బేటి చైతన్యకృష్ణారెడ్డి, చిల్లకూరు పీఏసీఎస్ డైరెక్టర్ పెళ్లకూరు గోపాల్‌కృష్ణ, చంద్ర, హరిబాబు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళ సాధికార, మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. పిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై విద్యార్థులు అవగాహన కల్పించి నిర్మూలించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ధర్మాప్రసాద్, మహిళా సాధికార విభాగ అధ్యక్షురాలు ఉషారాణి, వైస్ పిన్సిపాల్ విక్టోరియా రాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మములాజాన్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పల్లవి, అనిత ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను కార్యక్రమంలో హెచ్‌ఎం, పీడీ విజయ లక్ష్మి అభినందించారు.

వాలీబాల్ పోటీలకు కోటపోలూరు విద్యార్థి



క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీల్లో కోటపోలూరు హైస్కూల్‌కు చెందిన కిలివేటి క్రాంతికుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో క్రాంతికుమార్ పాల్గొననున్నారు. క్రాంతికుమార్, పీఈటీ భాస్కర్‌ను ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.

చిట్టమూరు, గునపాడు విద్యార్థులు...



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన వాసు, శ్రావ్య

చిట్టమూరు, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దారా వాసు, గునపాడు ఉన్నత పాఠశాలలో 9 తరగతి చదువుతున్న యన్నం శ్రావ్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వారిని ఎంఈవో బీవీ కృష్ణయ్య, చిట్టమూరు, గునపాడు హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, భూపయ్య, పీడీ భరత్ మహిపతి అభినందించారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ యజమానులు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ అనసూయ అన్నారు. శుక్రవారం పలు ఎరువుల దుకాణలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులు, విత్తనాలు విషయాల్లో రైతులను ఇబ్బందులు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎరువుల అమ్మకాలు జరగాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏవో సుజాత, డక్కిలి ఏవో శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: ఇద్దరికి గాయాలు

తడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. తడకు చెందిన వెంకటేశ్వర్లు(42) శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శుక్రవారం సొంత పనిమీద కుమార్తె సంధ్యతో కలసి బైక్‌లో సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి వెళ్తుండగా చేనిగుంట జాతీయ రహదారి మలుపు వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ

కోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కోటకు చెందిన రఘువరణ్, ఈశ్వరయ్య మోటారు బైక్‌లలో వెళ్తూ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ

డక్కిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా పంపిణీలో ఎరువుల దుకాణ దారులు పారదర్శకత పాటించాలని వెంకటగిరి వ్యవసాయ సంచాలకులు అనుసూయ అన్నారు. శుక్రవారం ఆమె డక్కిలిలోని ఎరువుల దుకాణాలను సందర్శించి యూరియా పంపిణీలో డీలర్లకు సూచనలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కార్డుపొందిన రైతులకు మాత్రమే యూరియా బస్తాలు అందజేయాలని దుకాణదారులకు సూచించారు. డీలర్లు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, స్టాక్ రికార్డు పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి శిరీషా తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పంచలోహ విగ్రహ వితరణ



వెంకన్నపాళెంలో ఊరేగుతున్న కోటమ్మ విగ్రహం

కోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు వెంకన్నపాళెం గ్రామానికి చెందిన మనపాక వెంకటేష్, వెంకటశేషమ్మ పంచలోహ విగ్రహాన్ని శుక్రవారం అందజేశారు. అలాగే ఊంజల్ సేవకు అవసరమైన సామగ్రిని వితరణగా ఇచ్చారు. ఆ విగ్రహంతో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ వెంకన్నపాళెం నుంచి కోటమ్మ గుడి వరకు గ్రామోత్సవం జరిగింది.

తుఫాను బాధితులకు సరుకుల పంపిణీ



తుఫాను బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు

డక్కిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగోడు గ్రామంలో తుఫాను కారణంగా నష్టపోయి పునరావాస కేంద్రాల్లో తలదాచుకొన్న 65 కుటుంబాలకు శుక్రవారం డిప్యూటీ తమసీల్దార్ ప్రసన్నరాణి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధితులకు 25 కిలోలు బియ్యం, చక్కెర, కందిపప్పు, నూనే, ఆలుగడ్డలు, ఎర్రగడ్డలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, లింగసముద్రం సింగిల్ విండో అధ్యక్షుడు రంగినేని రాజా పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చిల్లకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బందులకు గురైన తమ్మినపట్నం గిరిజనకాలనీ వాసులకు శుక్రవారం తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో రామయ్య, వెంకయ్య, సుబ్రహ్మణ్యం, వీఆర్‌వో బాలాజీ, కరపయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు కూరగాయలు

తడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా వేటను నిలిపివేసిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం సరఫరా చేసిన కూరగాయలు శుక్రవారం తడకు చేరుకున్నాయి. వాటిని ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ చేతుల మీదుగా మత్స్యకార నేత బొమ్మన పళణికి భీములవారిపాళెంలో అందజేశారు. అనంతరం ఒక్కో మత్స్యకార కుటుంబానికి కేజీ చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏకాంబరం, సుధాకర్, జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెళ్లకూరు, అక్టోబరు, 31 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ హరికృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని చెంబడిపాలెం గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఎంపీడీవో ప్రమీలారాణి మాట్లాడుతూ పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిదని, ఒకరు ఇంకొకరిపై వివక్ష చూపితే చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందన్నారు. అనంతరం ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో శశికుమార్, జమాలుల్లా, రాఘవయ్య, మీరసాహెబ్, నజిర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ కృషి

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పేదప్రజల అభ్యున్నతి కోసం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎనలేని కృషిచేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, వేమయ్య, సుబ్బారావు, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంగళంపాడులో సెన్సార్ వీధి దీపాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు పంచాయతీలో సర్పంచ్ రుక్మిణి, టీడీపీ నాయకుడు ఏలిమేటి సతీష్ ఆధ్వర్యంలో సెన్సార్ వీధి దీపాలు ఏర్పాటు వేశారు. మంగళంపాడు గ్రామంతో ఆత్రేయ కాలనీ, ఎస్సీ ఎస్టీ కాలనీల్లో 94 వీధి దీపాలు ఏర్పాటు వేశారు. ఇవన్నీ సాయంత్రం 6గంటలకు వెలిగి తిరిగి ఉదయం 6గంటలకు ఆరిపోయే విధంగా సెన్సార్ అమర్చారు.





గూడూరులో 2కే రన్‌లో డీఎస్పీ గీతాకుమారి, పోలీసులు - నాయుడుపేటలో 2కే రన్‌ను జెండాఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దేశ సమైక్యతకు యువత పాటుపడాలి

గూడూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు యువత పాటుపడాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోటుపాళెం జాతీయ రహదారి కూడలి నుంచి పట్టణంలోని టవర్‌క్లాక్ కేంద్రం వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ అంకితభావంతో కృషి చేస్తోందన్నారు. దేశ సమగ్రత కోసం ప్రాణాలను సైతం అర్పిస్తూ ఎందరికో పోలీసులు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారన్నారు. దేశ ఐక్యత కోసం ఆయన ఎనలేని కృషిచేసిన తొలి ఉపప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను యువత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు, హుస్సేన్‌బాషా, ఎస్‌ఐలు తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం రాజు, షాజహాన్, పవన్‌కుమార్, సురేష్‌బాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, కోటేశ్వరరావు, డాక్టర్ పీర్‌కుమార్, డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తొలి ఉపప్రధాని సర్ధార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. పటేల్ జయంతి, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపును పురస్కరించుకునిలో శుక్రవారం పాత బస్టాండ్ నుంచి సీఎస్ తేజా సెంటర్ వరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు డీఎస్పీ చెంచుబాబు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు బాబి, సంగమేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఎంఈవో మునిరత్నం, ఎస్‌ఐలు నాగరాజు, ఆదిలక్ష్మి, భానుప్రసన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తడ: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్, విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వెంకటగిరి టౌన్: పోలీసు అమవీరుల దినోత్సవం, సర్ధార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 2కే రన్ నిర్వహించారు. 9వ బెటాలియన్ కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్, వెంకటగిరి సీఐ రమణ ఆధ్వర్యంలో క్రాస్ రోడ్డు నుంచి పాలకేంద్రం వరకు 2కే రన్ నిర్వహించారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీల

కోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, ఈ దిశగా పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బ్యాంకుల రుణాల రికవరీ, పింఛన్ పథకాల ప్రచారంపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో పొదుపు సంఘాలు వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. అదే విధంగా మలివిడత రుణాలు పొందేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సంఘమిత్ర అధ్యక్షురాలు ముత్యాలమ్మ, సీసీలు ప్రసాద్, శ్రీకాంత్, భాస్కర్, శంకర్, అలివేలమ్మ, బిందు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



దివ్యజ్యోతిని సన్మానిస్తున్న ఎంపీడీవో నారాయణ, సిబ్బంది

బాలాయపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యజ్యోతి స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. శుక్రవారం ఆమెను ఎంపీడీవో నారాయణ, సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

పెళ్లకూరు, అక్టోబరు, 31 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని జీలపాటూరు, పెళ్లకూరు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేరకణ చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, నాయకులు ఇలుపూరు పాండురంగయ్య మొదలియార్, కేసు ప్రసాద్‌యాదవ్, పట్టూరు మోహన్‌రెడ్డి, ఎల్లు మోహన్, జితేంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీ కరణను వ్యతిరేకిస్తూ వైసీపీ మండల అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని జయంపు గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మచెట్ల సంరక్షణపై అవగాహన

వెంకటగిరి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొక్కలపాడు, పాలకొండ సత్రం గ్రామాల్లో రైతులకు నిమ్మచెట్ల సంరక్షణపై ఉదానవన శాఖ అధికారి ఆనంద్‌రెడ్డి, కేవీకే అధిపతి శ్రీధర్ శుక్రవారం అవగాహన కల్పించారు. తుఫాన్ వల్ల నేలకు వరిగిన చెట్లకు ఊతం ఇచ్చి నిలబెట్టాలన్నారు. అలాగే పాదుల్లో ఉండే అధిక నీరు తొలగించి బ్లైటాక్స్ పిచికారీ చేయాలని, చెట్లకు మొదలు భాగంలో యూరియా, పొటాష్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మతకాముడి - దామానెల్లూరు క్రాస్ రోడ్డు వద్ద తండా రమణయ్య మరో నలుగురు వ్యక్తులు తనను అడ్డగించి మరణాయుధాలతో దాడి చేశారని సూళ్లూరుపేట ఎంఈవో కార్యాలయంలో ఎంఆర్పీగా పని చేస్తున్న వేలూరు అంకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఈనెల 29న సుగ్గుపల్లి పాఠశాలకు వెళ్లి వస్తుండగా దామానెల్లూరు - మతకాముడి క్రాస్ రోడ్డు వద్ద నలుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి: కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబర్ 31(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలన్న ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్న నేపథ్యంలో వెంకటగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్న విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. వెంకటగిరి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే పాలనా సౌలభ్యంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల పురష్కరించుకుని శుక్రవారం సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా, ముందుగా సీఐ మురళీకృష్ణ, అనంతరం పట్టణంలోని పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యుడు రమేష్, సూళ్లూరుపేట, తడ, ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, కొండపనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి ఉపాధి కూలీలకు డిజిటల్ హాజరు

తడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు శనివారం నుంచి డిజిటల్ హాజరు నమోదు చేయనున్నట్లు ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొత్త విధానంలో రోజుకు రెండుసార్లు కూలీ హాజరును నమోదు చేస్తారని చెప్పారు.

యూరియా కార్డులను తీసుకోండి

బాలాయపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యూరియా కావాల్సిన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ అసిస్టెంట్‌లను సంప్రదించి కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించేందుకు, పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

పూరిల్లు దగ్ధం

పెళ్లకూరు, అక్టోబరు, 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరులో ఓ పూరిల్లు శుక్రవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎద్దల కృష్ణారెడ్డి పూరింట్లో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చేలరేగాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు కాలిపోయింది. వీఆర్వో మోబీనా వివరాలు తెలుసుకున్నారు.